2015 నవంబర్

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక

ప్రధాన సంపాదకులు :

రెవ.డా॥ కె. జోసఫ్

సర్క్యులేషన్ :

సామ్రాట్ కొడవటికంటి

చందా వివరములు :

సంవత్సర చందా రూ. 150/-

పోషక చందా రూ. 1000/-

జీవిత చందా రూ. 3000/-

విడి ప్రతి రూ. 15/-

మా చిరునామా :

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28

ఒంగోలు - 523001

ఫోన్ : 08592-231281

సెల్ : 9704255416

## లోపలి పేజీల్లో...


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| అపొస్తలుడు | కొడవటికంటి | 03 |
| లియో టాల్‌స్టాయ్ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 06 |
| పగిలిన ఓడ | మామయ్య కథలు | 09 |
| | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | |
| బైబిలు చరిత్ర | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 11 |
| మధ్యకాలము | బ్రదర్ కె. సామ్రాట్‌గారు | 14 |
| సంఘములు | రెవ. డా॥ కొడవటికంటి విక్రాంత్ | 16 |
| అబద్ధములు మరియు మోసములు | | |
| | శ్రీమతి రిబ్కా విక్రాంత్ | 19 |
| సాక్ష్యము | జెరోము | 20 |
| క్రిస్మస్ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 22 |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | | 24 |
| | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | |


India Evangelistic & Relief Fellowship

| EVANGELISM | RELIEF |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |

ప్రకటన రేట్లు

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



క్రీస్తునందు ప్రియులైన పరిశుద్ధత పాఠకులకు ప్రభువైన యేసుక్రీస్తు నామమున శుభములు. ఇంతవరకు మీరు చూపించిన ప్రేమ ఇకముందు కూడ కొనసాగిస్తారని ఆశిస్తున్నాము. మీరు వ్రాస్తున్నా ఉత్తరాలకై, మరియు ఫోన్ ద్వారా మీ అభిప్రాయాలు, స్పందనలు తెలియజేస్తున్నందుకు వందనములు.

దేవుని మహా కృపనుబట్టి మరియొక మాసములో ప్రవేశించాము. దాదాపుగా సెప్టెంబరు మాసము వరకు విపరీతమైన ఎండలను అనుభవించాము. నైఋతి ఋతుపవనాలు నిరాశను మిగిల్చాయి. మన రాష్ట్రం చాలా వరకు కరువుతో బాధపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో త్రాగునీటికి కూడా ఇబ్బంది పడుతున్నారు. ప్రజలు రకరకాల విషజ్వరాలతో బాధపడుతున్నారు. వారికోసం, రైతులకోసం, విశ్వాసులకోసం మేము అనుదినము ప్రార్ధనలో జ్ఞాపకం చేసుకుంటున్నాము.

దేశం కల్లోలంగా వుంది. మతచాంధస వాదులు విజృంభించారు. మనుష్యుల్ని కేవలం ఆహార విషయాన్నిబట్టి చంపుతున్నారు. మత విద్వేషాల్ని రెచ్చగొడుతున్నారు. దేశం చాలా క్లిష్టపరిస్థితుల్లో ఉందని మీకు ప్రత్యేకముగా చెప్ప నవసరంలేదు. ఇవన్నీ రాకడకు సూచనలే. దేవుని బిడ్డలమైన మనం ప్రతి విషయాన్ని వాక్యంతో సరిపోల్చి చూసుకోవాలి ప్రతిదినము మనం మన కుటుంబం కొరకు అనగా మన బిడ్డల కొరకు ఎక్కువగా ప్రార్ధించాలి. మనం "లోకానికి ఉప్పుగాను, వెలుగుగాను ఉండాలని ప్రభువు సెలవిచ్చాడు కదా!" మన రాష్ట్రంకోసం, కేంద్రం కోసం, పట్టుదలగా ప్రభువు సన్నిధిలో మోకరించాలి. సొదొమ గొమొఱ్ఱాలను అగ్ని గంధకాలతో నాశనం చేయాలని దేవుడు తలంచి ఆ విషయాన్ని తన స్నేహితుడైన అబ్రాహాముకు తెలియపరచాడు. అబ్రాహాము దేవునితో మాట్లాడుతూ యాభైమంది నీతిమంతులుంటే ఆ పట్టణాన్ని నాశనం చేయికుండా ఉంటారా? అని అడిగి దేవుని అనుమతితో చివరకు సొదొమ గొమొఱ్ఱాలలో పదిమంది నీతిమంతులు కూడా లేరని అంగీకరించాడు. ఇది నేటి సమాజం పరిస్థితి. మన గ్రామాలను, పట్టణాలను, జిల్లాలను, రాష్ట్రాలను, కేంద్రాన్ని దేవుడు నడిపించునట్లు ప్రార్ధన చేయాలి.

క్రైస్తవులైన వారిని మరలా పూర్వపు మతంలోనికే లాగు కుయుక్తులతో సాతానుడు విజృంభిస్తున్నాడు. అయితే మన దేవుడు గొప్పవాడు ప్రార్ధనలు ఆలకించువాడు. మనం పట్టుదలతో ప్రార్ధిస్తే దేవుడు మనకు జయమునను గ్రహిస్తాడు. మీరందరు అట్టి ప్రార్ధనాపరులుగా ఉండాలని నా కోరిక.

నీ కోసం, పరిచర్యల కోసం క్రమంగా ప్రార్ధించండి. మీ కుటుంబాల్లో "కుటుంబ ప్రార్ధన" అలవాటును కొన సాగించండి. మీకందరికి వందనములతో

**-ఎడిటర్**

# అపొస్తలుడు



– కొడవటికంటి

ఒంటెల కాళ్ళ ధూళి ఇప్పుడు ఎఱ్ఱగా మారింది. ఇది – సిరియా ధూళి. సిరియా సూర్యుడు మరీ వేడిగా ఉన్నాడనిపిస్తుంది. కొండకొనకు చేరుకొన్నప్పుడు – తెల్లని మట్టి మిద్దెల గోపురాలు కనబడ్డాయి. సౌలు గుండె వేగంగా కొట్టుకోవటం వల్ల రక్తం వేగంగా ప్రవహిస్తుంది. అంతకంటే వేగంగా అతని మనోభావాలు పనిచేస్తున్నాయి. ఒక్కొక్క మైలు గడిచే కొలది సౌలులో పట్టుదల పెరుగుతుంది.

ఈ దమస్కు ప్రయాణం తీసుకొని జయకరంగా ముగించక పోతే యెరూషలేములో ప్రధాన యాజకుల దగ్గర, పెద్దల దగ్గర తనకు ఏమాత్రం గౌరవం ఉండదు. దమస్కులో తన కార్యం కనుక జయకరంగా ముగించితే యూదులలో తన భవిష్యత్ ఉజ్వలమై వెలుగుతుంది.

దమస్కు – పురాతన పట్టణమైనందు వల్ల ఇశ్రాయేలీయులకు ఒకప్పుడు గర్వకారణమైంది ఇప్పుడు అదే అవమాన కారణమైంది. ఇశ్రాయేలు దేశంలోని అన్యదేవతల ఆలయాలకు 'సీదోనీయులు' రూపకల్పన చేస్తే, బలిపీఠములకు దమస్కీయులు రూపకల్పన చేసారు.

నేడు ఈ నజరేయుని శిష్యులు–పాలస్తీనాలో ప్రారంభించి అన్యజనాంగములో కూడా ఈ మార్గమును ప్రబలము చేయటానికి వారధిగా దమస్కును ఏర్పరచుకొన్నారు. ఇక్కడ ఈ బోధ అరికడితే ఈ యేసు మార్గము ఇక ప్రబలకుండ నాశనం చేయవచ్చు.

రీఫత్ సౌలు ప్రక్కగా వస్తున్నాడు – "దమస్కులో ఈ శిష్యులకు ముఖ్యుడు – 'అననీయ'. ఈయన యేసు శిష్యులలో ఒకడు. ఆయన శిలువకు ముందు తన ఇతర శిష్యులలో డెబ్భై మందిని ఏర్పరచి, తను దేవుని వాక్యము ప్రకటించుటకు ఏ ఏ గ్రామాలకు వెళ్ళ నిశ్చయించుకొనెనో అక్కడికి వారిని ఇద్దరిద్దరుగా పంపించాడు.  వారు కొంతకాలం తర్వాత సంతోషంతో తిరిగివచ్చి వారి జయప్రదమైన కార్యములు అన్ని ఆయనకు చెప్పారు. అలా వెళ్ళిన డెబ్భై మంది ఇతర శిష్యులలో అననీయ ఒకడు.

యెరూషలేములో నజరేయుని నామమున – హింస కలిగినప్పుడు ఆయన దమస్కు వచ్చి ఇక్కడ నజరేయుని నామమున ప్రచారం చేస్తున్నాడని వార్త. అయితే దమస్కులోని యూదులందరి చేత మంచిపేరు పొందిన వాడును, ధర్మ శాస్త్రము చొప్పున భక్తిపరుడునై యున్నాడు" అన్నాడు.

"ధర్మశాస్త్రము చొప్పున భక్తిపరుడైతే సిలువ మరణం పొందిన వానిని, ఒక శాపగ్రస్తుని, ఎలా క్రీస్తు అని అంటారు?" ఆవేశంగా అన్నాడు సౌలు.

దమస్కు పట్టణం సమీపించింది. ఊరిగవిని ఇప్పుడు పూర్తిగా కనబడుతుంది. మిట్ట మధ్యాహ్నం సూర్యుడు తలమీద నిప్పులు చెరిగి పోస్తున్నాడు.

సూర్యతేజస్సును మించిన తెల్లనికాంతి, ఆకాశం నుండి ప్రకాశమానమైన వెలుగు – ప్రయాణం చేస్తున్న వారందరిని కన్నులు మిరుమిట్లు గొలిపేటట్లుగా కమ్ముకున్నది. బలమైన పెనుగాలి వీచటం వలన వారందరు నేలమీద పడిపోయారు. వారందరు భూకంపము కలిగినట్లుగా భావించారు. ఆ వెలుతురు మెరుపు వలె ఉండినను మెరుపువలె కొంచెంలో మాయమై పోకుండా అలానే ఉండినది. ఉప్పెన వలె శబ్దము అనేక స్థాయిలలో మారుతూ వినబడింది.

అయితే సౌలును మాత్రం ఆ శబ్దము – హెబ్రీ భాషలో, మిక్కిలి నిమ్మళమైన స్వరముగా, బాధ మిళితమైన ఆవేదనతో "సౌలా! సౌలా!" అని పిలిచింది. సౌలు కళ్ళు తెరిచాడు. కాని ఆ కాంతి ఏమి తగ్గలేదు. సౌలు ఏదో మాట్లాడబోయాడు. గొంతు పెగలలేదు. "నీవేల నన్ను హింసించుచున్నావు?" ప్రశ్న. జీవితాంతము వెన్నాడే ప్రశ్న – తనతో మాట్లాడేది దేవుడుకాదు. తనవలన బహుగా బాధలకు గురి అయిన మానవుని ఆవేదన. కాని తను బాధించిన నజరేయుని శిష్యులెవరూ తన దయాభిక్ష కోరలేదు. తను బాధించే కొలది అది వారి అదృష్టముగా వారు భావించినట్లు తనకు తోచేది.

ఇప్పుడు ఈ స్వరము ఎంత మృదువుగా మాట్లాడింది. తనను తప్పిదస్తునిగా చేయదలచిన స్వరముగా తోచలేదు.

కాని కారణం అడుగుచున్నట్లుగా మాట్లాడిన స్వరము. తనకంటే కోటి రెట్లున్న శక్తిమంతుని స్వరమైననూ, తనను ప్రేమిస్తున్న స్వరము. ఇటువంటి స్వరము తను ఎన్నడూ ఊహాలోనైన తలచలేదు...... ఎవరది?

ఇప్పుడు ఆయన రూపము కనబడుతున్నది. ఆయన కండ్లు దయా స్వరూపములు. ఇంతకు ముందు ఎన్నడును చూడని స్వరూపము.

"మునికోలలకు ఎదురు తన్నుట నీవు కష్టము" – ఇక నిలవలేక పోయాడు సౌలు. తన హృదయం ద్రవించి పోతుంది. ఈ గుండె పగిలిపోక ముందే "ప్రభువా..... నీ వెవరవు?" అన్నాడు.

గొంతు వణుకుతున్నది.

"నేను...నీవు హింసిస్తున్న యేసును" ఇప్పుడు ఆయన స్వరము విస్తారజలముల ధ్వనివలె మారినది.

"నీవు నన్ను చూచి వున్న సంగతి గూర్చియు,

నేను నీకు కనబడబోవు సంగతిని గూర్చియు,

నిన్ను పరిచారకునిగాను సాక్షినిగాను నియమించుటకై కనబడి యున్నాను. నీవు లేచి నీ పాదములు మోపి నిలువుము. నేను ఈ ప్రజల వలన, అన్యజనులవలన, హాని గలుగకుండ నిన్ను కాపాడెదను. వారు చీకటిలో నుండి వెలుగులోకి, సాతాను అంధకారము నుండి దేవుని వైపుకు తిరిగి నా యందలి విశ్వాసము చేత పాపక్షమాపణను, పరిశుద్ధ పరచబడిన వారిలో స్వాస్థ్యమును పొందునట్లు వారి కన్నులు తెరచుటకై నేను నిన్ను వారియొద్దకు పంపెదను".

సౌలు ఇప్పుడు కొంచెం స్థిమితపడ్డాడు. తనతో మాట్లాడు తున్న యేసు స్వరము – తన మీద ద్వేషముకాని, పగకాని ఉన్నట్లు కనిపించలేదు. అసలు ఇంతకు ముందు ఆయన పలికిన మాట – 'నీవు నన్నెందుకు హింసిస్తున్నావు?" అనిన స్వరం వలె లేదు. ఎంతోకాలంగా కలసి ఉన్న స్నేహితుని స్వరంలాగా ఉంది. తనని బాల్యమునుండి ఎరిగిన తండ్రి స్వరమువలె ఉన్నది.

"ప్రభువా! నేనేమి చేయవలెను?" అన్నాడు చేతులు జోడించి.

అప్పుడు కెరూబుల రెక్కల చప్పుడువంటి స్వరముతో "నీవు లేచి దమస్కులోకి వెళ్ళుము. అక్కడ నీవు చేయుటకు నియమింపబడినవన్నియు నీకు చెప్పబడును" అన్న తర్వాత క్రమ క్రమముగా ఈ స్వరూపము కనబడకుండా పోయింది.

ఒక్కసారిగా తన సహచరుల గొంతులు వినబడినవి. తను ఇప్పుడు నేలమీద కూర్చుని ఉన్నాడు. అంతా చీకటిగా ఉంది. దమస్కు ఎండ వీపుకు తగులుతుంది. వేడిగాలులు చెంపలకు తగులుతున్నాయి.

తనలోని శక్తి అంతా ఎవరో పిండిచేసినట్లుగా నీరసంగా ఉంది. కటిక చీకటి. రీఫత్ వీపుమీద తాకాడు.

"సౌలుగారు!" అని పిలుస్తున్నాడు.

సౌలు చిన్నగా మూల్గాడు. కాని లేచి నిల్చోలేక పోయాడు. జరిగిన సంగతి – ఏమి జరిగిందో ఎవరికి తెలియదు. ఏదో సంఘటన జరిగింది. మొత్తానికి – ఇది మానవులకు సంబంధించినది కాదు. బంట్రౌతులు చూచినప్పుడు సౌలు ముఖము పూర్తిగా మారిపోయింది. క్రొత్త మనిషి – సౌలుకు చూపుపోయిన సంగతి కూడ అర్థమవుతుంది.

జరిగిన సంఘటన 'ఇది' అని చెప్పటానికి – అటువంటిది ఇంతకు ముందు ఈ సృష్టిలో జరగక పోవటమే కారణం.

రీఫత్ ముందుకువచ్చి మంచి నీళ్ళ పాత్ర సౌలు చేతికి అందించాడు. సౌలు మంచి నీళ్ళు త్రాగిన తరువాత – "ద్రాక్షాపానీయం?" అన్నాడు రీఫత్.

తల అడ్డంగా తిప్పాడు సౌలు.

కొంచెం సేపు మౌనము....

"పట్టణంలోకి... అక్కడ తెలుపబడుతుంది" అని రీఫత్ గొణికాడు.

ఇప్పుడు ఒంటెల మీద ప్రయాణం చెయ్యలేము అను కున్నాడు రీఫత్. ఒంటెమీద ప్రయాణం చెయ్యాలంటే తర్ఫీదు ఉండాలి. కండ్లు మూసుకొంటే మనిషి స్థిరంగా ఎలా నిలబడ లేడో, అలాగే కండ్లు పోయినవాడు జంతువు మీదనుండి పడకుండా కూర్చోలేడు. కనుక రీఫత్ సౌలు చెయ్యి పట్టుకున్నాడు. "పట్టణంలో... సమాజమందిరము యొద్దకు" అన్నాడు.

సౌలు ఏమి మాట్లాడలేదు. సౌలుకు కంటిచూపుపోతే మిగిలిన వారందరికి నోళ్ళు పోయినట్లుగా ఉన్నారు. ఎవరూ

ఏమి మాట్లాడటం లేదు. అందరు నడుస్తూనే ఉన్నారు. జంతువులను నడిపిస్తున్నారు. సైనికులవలె ఉన్నవారంతా ఖైదీల లాగ ఖిన్నులైనారు.

పట్టణపు గవిని యొద్దకు వచ్చినప్పుడు సౌలు ఆగి పోయారు. "యూదా – తిన్ననివీధి రీఫత్, అక్కడకు తీసుకొని వెళ్ళు" అన్నాడు.

అనేక దినములు ప్రయాణం చేసి, పట్టణం చేరిన ఈ చిన్న సైన్యమును చూసిన వారందరు, వారి రాకను గురించి – విచారించిన యదార్థం ఎవరికి అంతుబట్టడం లేదు.

సౌలును యూదా ఇంటిలో వదలి రీఫత్ ప్రధాన యాజకులతో జరిగిన సంగతులు వివరించటానికి సైన్యంతో తిరిగి యెరూషలేము వెళ్ళిపోయాడు.

సౌలు ఏమి ఆలోచించలేక పోతున్నాడు. యూదా తన చిన్న నాటి స్నేహితుడు. అయితే దేవుని విషయాలు, ధర్మశాస్త్రపు విషయాలు అంతగా ఆలోచించడు. ప్రయాణంలో సంభవించినదంతా రీఫత్ ద్వారా విన్నాడు. రీఫత్ మరలా యేరూషలేము నుండి తిరిగి వచ్చేంత వరకు తన విషయం యూదాయే జాగ్రత్త తీసుకుంటాడు.

ఏ వైద్యుని దగ్గరకు తీసుకొని వెళ్ళటానికి సౌలు ఒప్పు కోలేదు. ఎవరితోను మాట్లాడటానికి ఇష్టపడలేదు. తనతో కూడ ఏమి మాట్లాడటం లేదు. ఎన్నిసార్లు అడిగినా, మూడు రోజులలో భోజనమైనా, పానీయమైనా ముట్టుకోలేదు. యూదాకు ఏమి అర్థం కాలేదు.

తాను ఉన్న గది ఎంత పెద్దదో? ఎలా ఉందో? తెలియదు. ఈ లోకములో తను జీవించి యున్నట్లుగా తోచలేదు. మార్గంలో తను చూచిన స్వరూపం తన మస్తిష్కం నుండి మాసిపోవటం లేదు. తను వినినమాట చెదరిపోవటం లేదు. ఇంతవరకు ముందు తన మదిలో మాటిమాటికి సైఫను రూపం మెదలి అతని ప్రార్థన వినబడుతుండేది. ఇప్పుడైతే ప్రతిక్షణం, ప్రతిఘడియ నజరేయుడైన యేసుని రూపం, స్వరం.

తను యదార్థంగా, ధర్మశాస్త్రానుసారంగా అనింద్యుడుగా జీవించినది అబద్ధమా? నా పితురుల పారంపర్యాచార మందు విశేషాశక్తి గలవాడనై ఉండుట దైవసమ్మతం కాదా? నా స్వజాతీయులలో నా సమాన వయస్కులైన అనేకులకంటే యూదా మతములో ఆధిక్యము నొంది ఉండుట తప్పా?

ఈనాటి యేసు యదార్థం! ధర్మశాస్త్రము యదార్థమే! అయితే ఈ రెండు నిజాలను కలిపే ముడి ఎక్కడ? యూదా మత ప్రవక్తలు యథార్థమే! ధర్మశాస్త్రము యథార్థమే! అయితే యేసు అంతకంటే యాథార్థము కాదా?

ఇది నిజమైతే ఇప్పుడు యేసు శిష్యులని చెప్పుకొనేవారు కూడా, నిజానికి యేసును సరిగా అర్థంచేసుకోక, అబద్ధాన్ని సత్యంగా చూపిస్తున్నారు. తనకు నిజమైన సమాధానము దొరకాలంటే, యేసును శరీరరీతిగా ఎరిగిన వారి వల్ల ప్రయో జనం లేదు. యేసు ఒక్కడే! ఆయన దేవుడు! సందేహం లేదు. అయితే ఈ సిలువ ఏమిటి? ఈ సిలువ మరణం – శాపగ్రస్తం. దీనికి సమాధానం యేసే! ఆయనే జవాబు! ఆయనను తెలుసుకొంటే? మోషేకు ధర్మశాస్త్రం ఇవ్వటానికి, బయలు పరచటానికి – సీనాయి పర్వతం ఎందుకు ఏర్పాటు చేసాడు? అదే – అరేబియాలోని సీనాయి. ఐగుప్తు నుండి విడిపింపబడిన బానిసలు, నెల తర్వాత సీనాయి వచ్చేంత వరకు ఆగి – అక్కడే తన ధర్మశాస్త్రాన్ని ఇచ్చాడు.

'భవిష్యత్ కార్యక్రమాన్ని బయలుపరచటానికి నలభై రాత్రుళ్ళు, నలభై పగళ్ళు నడిపించి, సీనాయి పర్వతం చేరిన తర్వాతే ప్రభువు మాట్లాడాడు.

కాని తను ఇప్పుడు చూపులేనివాడు. నశింపజేయటానికి కాని, శిక్షించటానికి గాని, గ్రుడ్డివాడిగా ఉండటానికి గాని తనకు ఆయన దర్శనము కలుగలేదు. ఆయనకు తన విషయంలో ఉన్న ఏర్పాటు నెరవేర్చబడే వరకు మౌనంగా ఉండటమే...!

ఇంతకుముందు దేవుని చిత్తం నెరవేర్చాలనే ఆశతో, దీక్షతో అనేక గ్రామాలకు, పల్లెలకు, పట్టణాలకు పరుగెత్తాడు. ఈనాడు ఆయన చిత్తం తెలుసుకోవటానికి 'ఎక్కడికి' ప్రయాణం లేదు. ప్రభువు తనకు చూపు ఇచ్చిన తర్వాత సినాయి వెళ్ళి అక్కడ ఆయన ఆజ్ఞ ఇచ్చేవరకు వేచి ఉండటమే! ఇక మీదట ఆయనదే ఈ జీవితం.

**(సశేషం)**

సీరియల్

# అపరాధియైన వారు ఎవరూ లేరు

## (లియో టాల్‌స్టాయ్)

"ఈ దారి ఎటువెళ్తుంది?" అన్నాడు వోల్గిన్. ఆ అబ్బాయి చెప్పాడు. నిఖాలస్‌ను కలిసి స్కూలును ఇంత దౌర్భాగ్యముగా ఎలా నడిపిస్తున్నాడో అడగాలి అనుకున్నాడు వోల్గిన్. బంగళాకు వచ్చేసరికి పదకొండు అయింది. నిఖాలస్ ఇప్పుడు పట్నం వెళుతున్నాడని అప్పుడు గుర్తుకు వచ్చింది. మాస్కోకు పోస్టు చెయ్యవలసిన ఉత్తరం పట్నంలో పోస్టు చెయ్యమని నిఖాలస్‌కి ఇవ్వాలనుకొని మర్చిపోయాడు. అది చాలా ముఖ్యమైన విషయం. మాస్కోలో మేడమ్ మోడన్నా – చిత్రపటం వేలంలో తనకొరకు కొనమని చెప్పారు. ఇంటికి వచ్చేసరికి బాగా బలిసి, తళతళ మెరుస్తున్న నాలుగు గుఱ్ఱాలు బండికి కట్టబడి ఉన్నాయి. దానిని నడిపేవాడు తొట్టిలో కూర్చుని చేతిలో ఖరీదైన హంటర్ పట్టుకొని ఉన్నాడు.

ప్రవేశద్వారము వద్ద చిరిగిన టోపీ పెట్టుకొని విరిగిన బూట్లు తొడుగుకొనిన యాభై సంవత్సరాల వ్యక్తి నిలబడి ఉన్నాడు. వోల్గిన్‌ని చూచి నమస్కరించాడు. "ఏమి కావాలి?" అన్నాడు వోల్గిన్.

"నిఖాలాస్‌ని చూడవచ్చానండి" అన్నాడు.

"దేనికొరకు?" అన్నాడు.

"నేను చాలా బాధలలో ఉన్నాను. నా గుఱ్ఱం చచ్చిపోయింది" అన్నాడు. వోల్గిన్ అతనిని ప్రశ్నలు అడుగుతున్నాడు.

"నాకు అయిదుగురు పిల్లలున్నారు. ఒకే ఒక గుఱ్ఱం ఉన్నది. అది చచ్చిపోయింది" అని ఏడ్వసాగాడు.

"ఇప్పుడేమి చేస్తావ్?" అన్నాడు వోల్గిన్.

అతను మోకాళ్ళ మీద వంగి "అడుక్కుంటాను" అని అలానే మోకాళ్ళమీద ఉన్నాడు.

ఆ ముసలివాని చూస్తూ తన పర్సులో నుండి మూడు రూబుళ్ళు తీసి అతనికి ఇచ్చాడు. అతనిని చూస్తూ "నీపేరేమిటి?" అన్నాడు వోల్గిన్.

"మిత్రి!" అన్నాడు. అతను తల నేలకి ఆనించి, వందనాలు అని చెప్పి లోనికి వెళ్ళాడు. వాకిలిదగ్గర నిఖాలస్ నిలుచుని ఉన్నాడు.

"నీ ఉత్తరం ఏది?" అన్నాడు నిఖాలస్.

"నేను మరచిపోయాను. దయచేసి క్షమించండి, ఒక్క నిమిషంలో వ్రాసి ఇస్తాను" అని తనగదిలోకి వెళ్ళి ఉత్తరం వ్రాసి, నూట ఎనభై రూబూళ్ళకి ఒక చెక్కు వ్రాసి అవి రెండూ కవరులో పెట్టి అడ్రసు వ్రాసి అతికించి నిఖాలస్‌కు ఇచ్చాడు.

ఉత్తరం తీసుకుంటూ "ఇందాక వచ్చిన వ్యక్తి మీతో మాట్లాడాడా? అతను త్రాగుబోతు. అయినా మంచివాడు. అతనికి సాయం చెయ్యవలసినదే" అన్నాడు నిఖాలాస్. బండి ఎక్కాడు. బండి కదిలింది. ఇంతలో మధ్యాహ్న భోజనానికి పిలుపు వచ్చింది.

పదిమంది మానవమాత్రులు ఈ మధ్యాహ్నం భోజనము కొరకు కష్టపడ్డారు. ఎనిమిదిమంది భోజనమునకు వీరంతా కష్టపడ్డారు. బల్లమీద వెండినీళ్ళ కూజాలు, మధ్యము, మినరల్ వాటర్, కత్తులు, ఫోర్కులు, ఇద్దరు మగపనివారు – వారు యూనిఫారం ధరించి వడ్డించడానికి సిద్ధంగా ఉన్నారు. వాళ్ళు యజమానురాలి ఆజ్ఞల ప్రకారం అటు ఇటు తిరుగుతున్నారు. అందరు భోజనాలు ముగించిన తర్వాత యజమానురాలు మరచిపోయిన ఇంకా కొన్ని వంటకాలను తెప్పించింది. కాని ఎలాగో అతికష్టం మీద భోజనము ముగించారు.

తన గుఱ్ఱం చనిపోయినందువల్ల అడుక్కొంటున్న ఆసామి పేరు మిత్రి సదారికోయ్! చనిపోయిన గుఱ్ఱం వద్దకు వెళ్ళేముందు ఆ రోజంతా అతను తిరుగుతూనే ఉన్నాడు. మొదటగా గుఱ్ఱం తోళ్ళుకొనే సునిన్ వద్దకు వెళ్ళాడు. తన గ్రామము ప్రక్కగా నివశిస్తున్నాడు. అతను ఇంటివద్ద లేదు.

కనుక అతను వచ్చేవరకు కూర్చున్నాడు. అతను వచ్చిన తర్వాత మధ్యాహ్నం భోజన సమయం వరకు బేరమాడుతూనే ఉన్నాడు. చనిపోయిన పశువులను ఊరికి దగ్గరలో పాతి పెట్టకూడదనే నిబంధన ఉన్నందువలన స్టైఫను దగ్గర గుఱ్ఱం బదులుకు పుచ్చుకొని స్టైఫన్‌ని బండిమీద ఎక్కించుకొని దాని తోలు ఒలిచి చాలాదూరంలో పాతిపెట్టాడు. మిత్రి చాలా అలసిపోయాడు. తనకు సహాయం చేసిన స్టైఫనుకు వందనాలు చెప్పి వెళ్ళి, సారాయికొట్లో కొంచెం సారాయి త్రాగాడు. ఇంటికి వెళ్ళగానే భార్య ఏదో అడిగింది. అతనికి కోపం వచ్చి భార్యను తిట్టి ఇంటి మూలలో ఉన్న గడ్డమీద అలానే పడిపోయాడు. అతను నిద్రలోకి వెళ్ళేముందు తన గుఱ్ఱం చనిపోయేముందు ఎలా అల్లాడిందో గుర్తుకువచ్చింది. గుఱ్ఱం చర్మము అమ్మగా వచ్చిన నాలుగు రూబుల్స్, వోల్గాన్ ఇచ్చిన మూడు రూబుల్సు, నిఖాలన్ ఇచ్చిన మూడు రూబుల్సు తన భార్యకు ఇచ్చి నిద్రపోయాడు. ఉదయాన్నే నిద్రలేచి తన కాళ్ళకు కట్టుకొనిన బూట్లు విప్పదీశాడు. ఇక అవి పనికిరావు. పంచలో ఉన్న టోపీని తీసుకున్నాడు. అది చాలా పేలికలుగా ఉన్నది. దానిని సరిచేసి తీసుకొని తలమీద పెట్టుకున్నాడు. ఇప్పుడతనికి గుఱ్ఱం లేదు. అతని భార్య ఇనుప పొయ్యివద్ద కూర్చుని ఒకచేత్తో చంటి బిడ్డను రొమ్మున ఆనించుకొని పాలిస్తుంది. ఆ బిడ్డ ఆమె ప్రక్కన వ్రేలాడుతూ పాలు త్రాగుతుంది. మిత్రి ఆ మూలలో వ్రేలాడుతున్న మూడు దేవుని బొమ్మలను చూచి కుడిచేత్తో మూడు నాలుగుసార్లు సిలువ గుర్తు వేసుకుంటూ ఏదో ప్రార్థనవంటిది గొణిగాడు. అదే అతని ప్రార్థన.

"ఇంట్లో నీళ్ళు ఏమైనా ఉన్నాయా?" అని భార్యను అడిగాడు. "పెద్దమ్మాయి నీళ్ళకి వెళ్ళింది" అని జవాబు.

పొయిలోనుండి వస్తున్న పొగకి అతనికి దగ్గు వచ్చింది. అక్కడున్న బెంచి చేత్తో పట్టుకొని బయటకు వచ్చాడు. పెద్దమ్మాయి నీళ్ళు తెస్తుంది. వెళ్ళి, బిందెలో నీళ్ళు చేత్తో తీసుకొని పుక్కిలించి ఊశాడు. మరలా కొన్ని నీళ్ళు తీసుకొని నోట్లో పోసుకున్నాడు. కుడిచేత్తో తలవెంట్రుకలను రుద్దుకున్నాడు. ఓ పదిసంవత్సరాల అమ్మాయి – పావడా కూడా చినిగివుంది. తల చెదరివుంది.

మిత్రికి "నమస్కారం" అన్నది. "మేము పొలము కళ్ళెము చేస్తున్నాము. నువ్వు వస్తావా? అని నాన్న అడగమన్నాడు" అన్నది.

"ఆల్‌రైట్ వస్తానమ్మా! నేను భోజనసమయం లోపల వస్తానని చెప్పు. నేను ఇప్పుడు ఉగ్రిమ్మి వెళ్ళాల్సిన పని ఉంది" అని చెప్పి, గతవారము ఈ పిల్ల తండ్రి తనకు తన పొలంపనిలో చాలా సహాయం చేశాడు. నేను తప్పక వెళ్ళాలి అనుకున్నాడు. మిత్రి పొలం వద్దకు వెళ్ళేటప్పటికి రెండు బక్కచిక్కిన గుఱ్ఱాలు కళ్ళెం మీద నీరసంగా నడుసూ ఉన్నాయి. ఒకడు గడ్డిని తిరగవేస్తున్నాడు. ఇద్దరు ఆడవాళ్ళు పంట పనలను చిన్నచిన్న కట్టలు కడుతుంటే ముగ్గురు పిల్లలు వాటిని కళ్ళం వద్దకు చేరుస్తున్నారు. ఇందాక ఇంటికి వచ్చిన పిల్ల కనబడింది.

"మీ నాన్న ఎక్కడ?" అని అడిగాడు.

"ఆయన వామి వద్ద ఉన్నాడు" అన్నది.

వామివద్దకు వెళ్తుంటే పొలం ప్రక్కగా ఒకమ్మాయి నేలలో నుండి ఉర్లగడ్డలు తవ్వి తీసి, ప్రక్కన ఉన్న కందువా మీద వేస్తుంది.

వామి వద్దకు వచ్చి మిత్రి తన కోటును తీసి ముండ్ల కంచెమీద వేశాడు. వెంటనే చాలా చురుకుగా పనిచెయ్యడం ప్రారంభించాడు. తలెత్తి చుట్టూచూశాడు. అందరు వారి సొంత పనివలె కష్టపడి పనిచేస్తున్నారు. అందరూ తనవలె సహాయం చెయ్యడానికి వచ్చినవారే! మధ్యాహ్నానికి పొలం యజమాని "భోజనం తయారు!" అని పెద్దగా అరిచాడు.

కొంచెంసేపటికి గడ్డి అంతా బయటకు లాగి గింజలు అన్నీ పోగుచేసి గోతాలలో పోశారు. అందరు చేతులు, కాళ్ళు కడుక్కొని ఇంటిలోకి వచ్చారు. ఇల్లంతా పొగ చూరి ఉన్నది. అయితే మధ్యలో బల్లమీద గిన్నెలు పెట్టి బెంచీలు చుట్టూ వేశారు. రొట్టె, సూపు, ఉడకబెట్టిన ఉర్లగడ్డలు వడ్డించారు. అందరు తింటుంటే వాకిలిదగ్గర ఒకమనిషి నిలిచాడు. అతనికి ఒక చెయ్యి లేదు. సంచి భుజానికి తగిలించుకొని – "మీకు సమాధానము కలుగును గాక! అందరికి మంచి ఆరోగ్యము

కలుగునుగాక! యేసుప్రభువు పేరుమీద నాకేమైనా పెట్టండి" అని అడిగాడు.

"దేవుడు నీకిస్తాడయ్యా" అని ఆ ఇంటి ఇల్లాలు, ఇంటికోడలు వైపు తిరిగి "అమ్మా! అతనికి కొంచెం పెట్టు" అని "ఏమిటి ఆలోచిస్తున్నావు?" అన్నది.

"అదే అత్తయ్యా! ఏమైనా మిగులుతుందా?' అని ఆలోచిస్తున్నాను అన్నది.

"తప్పమ్మా! అలా అనవద్దు. దేవుడు ఇతరులకు ఇవ్వమని చెప్పాడు కదా! ఒక రొట్టె ఇవ్వు" అన్నది. కోడలు రొట్టెతెచ్చి అతనికి ఇచ్చింది. అందరు భోంచేసి లేచి నిలుచుని "దేవుడు ఈ ఇంటివారిని దీవించునుగాక!" అని బయటకు వచ్చి చెట్టు నీడను కూర్చున్నారు.

మిత్రి అయితే గబగబ నడుస్తూ చిల్లరకొట్టు వద్దకు వెళ్ళి తన పొగగొట్టంలోకి కొంచెం పొగాకు కొని దానిలో వేసి ముట్టించి, ఎంతో తృప్తిగా పొగవదిలాడు. మిగిలిన వారి దగ్గరకు వచ్చి కూర్చుని "పాలిచ్చే పశువు ధర ఎంత పలుకుతుంది?" అని అడిగాడు. తనకు గుణ్ణం అవసరం ఎంతైనా ఉంది. తన ఆవును అమ్మి గుణ్ణం కొనాలని మిత్రి ఉద్ధేశ్యం.

ఈ విధంగా బీదలు బీద భోజనం చేస్తూ తిండి కంటే ఎక్కువైన పనులుచేస్తూ మానసికముగాను శారీరకముగాను కృంగి కృశించి పోతున్నారు. కొందరైతే బాగా బ్రతుకుతూ క్రైస్తవులమని చెప్పుకుంటూ తమ చుట్టూ జీవిస్తున్న పేదల విషయం ఆలోచించరు. మరికొందరైతే క్రైస్తవ్యము అయినా మరేదైనా మా నీతిని మేము గౌరవంగా బ్రతుకుతున్నాము అని తృప్తిపడతారు.

వేలకొలది బీదజీవులు తమ ఆకలిని చంపుకోవడానికి మాత్రమే చేతికి వచ్చిన పనులుచేస్తూ మిగిలిపోతారు. ధనవంతులైనవారు తమ విలాసాలకు సరిపోయే వస్తు సామాగ్రి కొరకుని ఫ్యాక్టరీలలో హోటళ్ళలో పనిచేసే బానిసల వంటి జీవితం జీవించేవారు చేసే చిన్న పొరపాట్లకి ధనవంతులు బీదల దగ్గర అధికమూల్యము వసూలు చేసి పైగా శిక్షిస్తారు. ఇవన్ని చూసి..చూసి.. అలవాటైన మానవులకు బీదలు అంటే – వారు నిత్యం ఉపయోగించుకొనే వస్తుసముదాయాలలో ఒకరు అని విశ్వసించి దానికి వ్యతిరేకమైన భావనను వారి హృదయంలోకి చేరనీయరు.

ఇక్కడున్న ఓ పెద్దాయన వయస్సులో పెద్దవాడు, చదువులో పెద్దవాడు, ఆస్థిలో పెద్దవాడు. ప్రతిరోజు పేపరు చదివి తన ఉద్ధేశ్యాన్ని తన హృదయంలోనే ఉంచుకొని గవర్నమెంటు మీద కామెంట్సు చేస్తున్నాడు. ఇక్కడ కూర్చున్న పెద్దాయన పూర్వం ఒక రాష్ట్రానికి గవర్నరుగా ఉండి ఇప్పుడు శాసనసభ్యునిగా స్థిరపడి పేపరు చదువుతూ ఉరిశిక్షను గవర్నమెంటువారు రద్దుచేయరు అన్న హెడ్డింగు చదివి సంతోషించాడు. ఇప్పటివరకు ఉరిశిక్షను అమలు జరిపింది బీదలమీదనే అని ఆలోచించాడు.

ఇక్కడ ఒక దయగల పెద్దమ్మ తన దగ్గరున్న బొమ్మల పుస్తకంలోనుండి నక్కకధ, కుక్కకధ తన మనుమలకు చదివి వినిపిస్తూ పిల్లలు సంతోషిస్తుంటే ఆమె బోసినవ్వులు కురిపిస్తుంది.

ఇక్కడున్న ఒకమ్మాయి (చిన్నపిల్ల) – తను ఎక్కడికి వెళ్ళినా చెప్పులు లేకుండా నిక్కరులేకుండా చినిగిపోయిన పావడా వేసుకొని ఆకలితో క్రింద రాలిపడిన వేపపండ్లను తింటూ తనచుట్టూ తిరిగే పిల్లలను చూసి జీవితమంటే అంతా ఇంతే అనుకుంటుంది.

**ఇలా ఈ దేవుని లోకంలో ఎందుకు జరుగుతుంది?**

Read Our Internet Edition @
**www.holinessmagazine.com**

చిన్నపిల్లల పేజి




# పగిలిన ఓడ

పిల్లలూ! బాగున్నారా? మీరంతా స్కూలు వెళ్తూ, పాఠాలతో, హోంవర్క్‌తో చాలా బిజీగా ఉన్నారు కదా! అయినప్పటికీ మీరు ప్రతిరోజు బైబిలు చదవటం, ప్రార్థించటం మానవద్దు. చిన్నబిడ్డల ప్రార్థన దేవుడు తప్పకుండా వింటాడు. ప్రార్థించటం ద్వారా దేవుడు మీకు జ్ఞానము, తెలివితేటలు ఇస్తాడు. మీ స్కూల్లో మీకు విజయము దయచేస్తాడు. మీరు కేవలం మీ కోసమే కాకుండా మీ స్నేహితుల కోసం కూడా ప్రార్థించాలి. ప్రార్థన ద్వారా మీరు ఎన్నో అద్భుతాలు చూడగలుగుతారు. నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమించడం అంటే వారి కోసం ప్రార్థించడమని కూడా మనం గ్రహించాలి.

ఒక అందమైన రోజు ప్రశాంతంగా ఒక ఓడ సముద్రం పై ప్రయాణిస్తుండగా యింతలోనే ఒక పెద్ద తుఫాను వచ్చి ఓడ రెండు ముక్కలైయింది. అప్పుడు అందులో ఉన్న జాన్, పీటర్ అనే ఇద్దరు మనుష్యులు ఆ పక్కనే ఉన్న ఎడారిలాంటి దీవిలోకి ఈదుకుంటు వెళ్ళారు. అక్కడ వాళ్ళకి తినటానికి ఏమి కనబడలేదు. ఆ దీవి అంతా ఎండిపోయి ఉంది. వాళ్ళకి ఒకే ఒక్క దారి కనిపించింది. యేసుకి ప్రార్థించాలి అని అనుకున్నారు. ఎవరి ప్రార్థనా బలమైనదో తెలుసుకుందామని అనుకున్నారు. అలా వాళ్ళిద్దరూ విడిపోయి చెరొక వైపు దీవి చివరికి వెళ్ళి పోయారు.

జాన్ తన ఆకలి తీర్చుకుందామని ఆహారం కోసం ప్రార్థించాడు. ఆ తర్వాత రోజు అక్కడ ఉన్న జాన్‌కి ఒక చెట్టు కనిపించింది. దాని నిండా పండ్లు కనిపించాయి. ఆ చెట్టుకున్న ఒక పండ్లు తీసుకొని తిన్నాడు. కాని పీటర్‌కి ఆ ఎండిపోయిన నేల తప్ప ఏమి లేదు.

ఒక వారం తర్వాత జాన్‌కి ఒంటరిగా అనిపించి భార్య కోసం ప్రార్థించాడు. ఆ తర్వాత రోజే ఒక ఓడ పగలిపోయి అందులో నుంచి ఒక ఆమె ఈదుకుంటూ జాన్ దగ్గరికి వచ్చింది. దీవి మరొక వైపు ఉన్న పీటర్‌కి ఏమి లేవు.

మరల వెంటనే జాన్ ఇళ్ళు, బట్టలు, ఆహారం కోసం ప్రార్థించాడు. ఆ తర్వాత రోజే జాన్‌కి అవన్ని కలిగాయి. కాని పీటర్‌కి మరి ఏమి లేవు.

చివరికి జాన్ ఓడ కొరకు ప్రార్థించాడు. అప్పుడు ఆయన అతని భార్య ఆ దీవి వదిలి వెళ్ళిపోవచ్చు కదా. ఆ తర్వాత రోజు ఉదయాన్నే ఒక ఓడ వచ్చి జాన్ ఉన్న

వైపు ఆగింది. ఆయన అతని భార్య ఓడ ఎక్కరు. జాన్ పీటర్‌ని వదిలి వెళ్ళాలనుకున్నాడు. ఎందుకంటే పీటర్ దేవుని దీవెనలన్నిటికి అర్హతలేనివాడు అని జాన్ అను కున్నాడు. అతని ప్రార్ధనలకు కూడా జవాబు రాలేదు కదా.

ఎప్పుడైతే ఓడ కదలబోతుందో అప్పుడు జాన్‌కి ఒక స్వరం పరలోకం నుండి వినిపించింది. ఎందుకు నువ్వు నీతో ఉన్న పీటర్‌ని వదిలేసి పోతున్నావు?

ఈ ఆశీర్వాదములన్ని నావీ ఎందుకంటే నేను మాత్రమే ప్రార్ధించాను. పీటర్ చేసిన ఒక ప్రార్ధనకి కూడా జవాబు రాలేదు. అలాంటప్పుడు ఇవ్వన్ని పీటర్‌కి ఎందుకు అని అన్నాడు. అప్పుడు "నువ్వు తప్పుగా అనుకున్నావు అని ఆ స్వరం జాన్‌ని గద్దించింది. పీటర్ ఒకటే ప్రార్ధించాడు. నేను దానికి జవాబిచ్చాను. పీటర్ అలా ప్రార్ధించకపోతే నా దగ్గర నుంచి నీకు ఇవేమి వచ్చేవి కావు.

అదేంటో నాకు చెప్పు ప్రభువా అని జాన్ అడిగాడు. పీటర్ ఒకటే ప్రార్ధించాడు నువ్వు చేసిన ప్రార్ధనలన్నిటికి జవాబు దొరకాలని.


అప్పుడు జాన్ అతను చేసిన దానికి బాధపడి పీటర్‌ని ఓడ ఎక్కించుకొని అతనికి కృతజ్ఞతలు చెప్పాడు.

పిల్లలూ! కథ చదివారు కదా. ఈ కథలోని భావాన్ని అర్ధం చేసుకున్నారు. జాన్ తనకు కలిగినవన్నీ తను చేసిన ప్రార్ధనల వల్లె కలిగాయని అనుకున్నాడు. కానీ పీటర్ తనకోసం ప్రార్ధన చేశాడని అతనికి తెలియదు. కాబట్టి పిల్లలూ! మీ ఇతరుల కోసం ప్రార్ధన చేయడం దేవునికి చాలా ఇష్టం.

## పాఠకులకు గమనిక

**'పరిశుద్ధత'** మాసపత్రికను మీరు ఎంతగానో ఆదరిస్తున్నందుకు మీకు మా కృతజ్ఞతలు. పత్రిక కావాలని అనేకమంది ఉత్తరాల ద్వారా, ఫోన్స్ ద్వారా అడుగుతున్నారు. "మీ పత్రిక ఫలానా చోట చూశాము. మీ పత్రిక చాలా బాగుందండీ, మా అధ్యాత్మిక జీవితానికి ఎంతో మేలుకరంగా ఉంది. దయచేసి మాకు కూడా పంపండి. మేము చందా కడతాము" అని అడుగుతున్నారు. అలా అడిగిన వాళ్ళందరికీ పంపాలంటే ఇప్పుడు చందా కట్టకుండా ఉచితంగా పత్రిక పొందుతున్న వాళ్ళందరికీ ఆపాలి. అందుకనే గత నెలలో పత్రికతో పాటు "పత్రిక కావాలా? వద్దా?" అనే విషయం పోస్ట్‌కార్డ్ ద్వారా తెలియజేయమని పోస్ట్‌కార్డ్ పంపించాము. అందువలన పోస్ట్‌కార్డ్ తిరిగి మాకు పంపని వాళ్ళందరికీ వరుసక్రమంలో పత్రిక ఆపివేయబడుతుంది. పత్రిక కావలసిన వాళ్ళు ఫోన్‌ద్వారా కాని, పోస్ట్‌కార్డ్ ద్వారా కాని తెలియజేయగలరు. నేటి పరిస్థితులలో పత్రిక నిర్వహణ చాలా వ్యయప్రయాసలతో కూడుకొని ఉన్నప్పటికీ, కేవలం విశ్వాసము ద్వారానే ఈ పత్రిక నిర్వహించగలుగు తున్నాము. అయితే పాఠకులు చందా కట్టడం తమ బాధ్యతగా గుర్తించాలి. ఎందుకంటే మీరు చందా కట్టటం వలన ఇంకా అనేకమందికి పత్రిక పంపడానికి సాధ్యమవుతుంది. సంవత్సరమంతటికీ కలిపి కేవలం 150/- రూపాయలు అన్నది ఎన్నతగినది కాదు. కావున పాఠకులు సహృదయముతో ఆలోచించి చందా కట్టవలసినగా ప్రభువు పేరట వేడుకొనుచున్నాను.

**- ఎడిటర్**



# బైబిలు చరిత్ర

7

సేకరణ: రెవ.డా॥ కె.జోసఫ్

### రెండవ దినవృత్తాంతములు-పరిచయం

రెండవ దినవృత్తాంతములు గ్రంథం మొదటి దినవృత్తాంతములు గ్రంథంలోని చరిత్రనే కొనసాగిస్తోంది. సొలొమోను పరిపాలనతో ప్రారంభమైన ఈ గ్రంథం అతని మరణం గురించి అతని కుమారుడు రాజ్యానికి వారసుడు అయిన రెహబాము గురించి, యరొబాము నాయకత్వంలో ఉత్తర గోత్రాల తిరుగుబాటు గురించి వివరిస్తోంది. అయితే ఈ గ్రంథంలో ప్రధానంగా దక్షిణరాజ్యమైన యూదా చరిత్ర కనిపిస్తోంది.

**విషయసూచిక**

సొలొమోను పరిపాలన 1:1-9:31
- (ఎ) తొలి సంవత్సరాలు 1:1-17
- (బి) దేవాలయ నిర్మాణం 2:1-7:10
- (సి) చివరి సంవత్సరాలు 7:11-9:31

ఉత్తర గోత్రాల తిరుగుబాటు 10:1-19
యూదా రాజులు 11:1-36:12
యెరూషలేము పతనం 36:13-23

### ఎజ్రా-పరిచయం

ఎజ్రా గ్రంథం దినవృత్తాంతములు తర్వాత జరిగిన పరిణామాలను వివరిస్తోంది. బబులోనుచెరనుండి కొందరు యూదులు తిరిగివచ్చి యెరూషలేములో ప్రజాజీవనాన్ని మరియు దైవారాధనను పునరుద్ధరించడం ఈ గ్రంథంలోని ముఖ్యాంశం.

**విషయసూచిక**

చెరనుండి తొలి విడతగా వచ్చినవారు 1:1-2:70
దేవాలయ పునర్నిర్మాణం, మరియు ప్రతిష్ఠ 3:1-6:22
మలి విడతగా వచ్చినవారితోబాటు ఎజ్రా తిరిగిరావడం 7:1-10:44

### నెహెమ్యా-పరిచయం

నెహెమ్యా గ్రంథం దేవుడే తన ఆశ్రయమంటూ పట్టుదలతో ప్రార్థించిన నెహెమ్యా లక్ష్యసిద్ధి గురించి వివరిస్తోంది.

**విషయసూచిక**

నెహెమ్యా యెరూషలేముకు తిరిగి రావడం 1:1-2:20
యెరూషలేము ప్రాకారాల పునర్నిర్మాణం 3:1-7:73
ధర్మశాస్త్ర పఠనం, మరియు నిబంధన పునరుద్ధరణ 8:1-10:39
నెహెమ్యా ఇతర కార్యాలు 11:1-13:31

### ఎస్తేరు-పరిచయం

ఎస్తేరు గ్రంథం పారసీక చక్రవర్తి శీతకాలపు రాజప్రాసాదంలో ఎస్తేరు అనే యూదు కథానాయకురాలి చుట్టూ పరిభ్రమించిన కథనాల సమాహారం. అసామానమైన ధైర్యసాహసాలను అచంచలమైన దైవభక్తిని ప్రదర్శించిన ఎస్తేరు తన జాతిని శత్రుసంహారంనుండి కాపాడింది. యూదుల పండుగ పూరీము నేపథ్యాన్ని అర్థాన్ని ఈ గ్రంథం విశదీకరిస్తోంది.

**విషయసూచిక**

రాణిగా ఎస్తేరు నియామకం 1:1–2:23

హామాను కుతంత్రాలు 3:1–5:14

హామాను మరణశిక్ష 6:1–7:10

యూదులు తమ శత్రువులపై విజయం సాధించడం 8:1–10:3

### **యోబు**–పరిచయం

సకల విపత్తులకు గురైన నీతిమంతుడైన వ్యక్తి గాథ యోబు గ్రంథం. యథార్ధ వర్తనుడైన యోబు తన సంతానాన్ని యావదాస్తిని కోల్పోయి జుగుప్సాకరమైన వ్యాధి బారిన పడతాడు. యోబు, అతని ముగ్గురు స్నేహితులు ఈ విపత్తులపట్ల చూపిన ప్రతిస్పందనను వారి మధ్య జరిగిన సంభాషణల పరంపరను గ్రంథకర్త పద్యరూపంలో వర్ణిస్తాడు. గ్రంథం చివర్లో దేవుడు యోబుతో మానవ చరిత్ర ఏ విధంగా తన ఆధీనంలో ఉందో చెబ్తాడు. యోబు కష్టాలు తొలగిపోయి, అతను తాను పోగొట్టుకున్నవన్నీ మళ్లీ పొంది భక్తి యథార్ధతలతో జీవించాడనే వర్ణనతో గ్రంథం ముగుస్తోంది.

**విషయసూచిక**

ప్రస్తావన 1:1–2:13

యోబు, మరియు అతని స్నేహితులు 3:1–31:40

(ఏ) యోబు వ్యధ 3:1–26

(బి) ప్రథమ సంభాషణ 4:1–14:22

(సి) రెండవ సంభాషణ 15:1–21:34

(డి) మూడవ సంభాషణ 22:1–27:23

(ఇ) జ్ఞాన ప్రశంస 28:1–28

(ఎఫ్) యోబు తుది ప్రకటన 29:1–31:40

ఎలీహు సంభాషణలు 32:1–37:24

యెహోవా యోబుతో మాట్లాడడం 38:1–42:6

గ్రంథ ఉపసంహారం 42:7–17

### **కీర్తనలు**–పరిచయం

వివిధ రచయితలు సుదీర్ఘ కాలవ్యవధిలో రచించిన స్తుతులు మరియు ప్రార్థనల సమాహారం కీర్తనలు. ఇశ్రాయేలు ఆరాధనలో ముఖ్యభాగమైన ఈ కీర్తనలు కాలక్రమేణా లేఖనాల్లో భాగమయ్యాయి. పలు ఇక్కట్లలో విభిన్న భావోద్వేగాలతో దేవుణ్ణి శరణు కోరినవారు సహాయాన్ని కాపుదలను రక్షణను క్షమాపణను అర్థిస్తూ చేసిన మనవులు, దైవాశీర్వాదాలకొరకు కృతజ్ఞతాస్తుతులు, శత్రుసంహారంకోసం విన్నపాలు ఈ కీర్తనల్లో ప్రధానంగా కనిపిస్తాయి. కీర్తనల్లో కొన్ని వ్యక్తిగత విన్నపాలు కాగా, మరి కొన్ని జాతి యావత్తు చేసిన ప్రార్థనలు; కొన్ని కీర్తనలు మనిషి అంతరంగంలోని ఆర్ద్రతలంపులు కాగ, మరి కొన్ని దేవుని ప్రజల అవసరాలను అనుభూతులను వెల్లడించే విజ్ఞాపనలు. ఈ గ్రంథంలోని నూట ఏభై కీర్తనలను అయిదు సంగ్రహాలుగా ప్రస్తావించారు.

**విషయసూచిక**

ప్రథమ స్కంధం 1–14 కీర్తనలు

ద్వితీయ స్కంధం 42–72 కీర్తనలు

తృతీయ స్కంధం 73–89 కీర్తనలు

చతుర్ధ స్కంధం 90–106 కీర్తనలు

పంచమ స్కంధం 107–150 కీర్తనలు

### **సామెతలు**–పరిచయం

నీతిని ధార్మికజీవనాన్ని ప్రబోధించే పలు సామెతలు సూక్తుల సంకలనం సామెతలు గ్రంథం. దైనందిన జీవితంలో ఆచరణసాధ్యమైన వివేకాన్ని, వ్యవహార జ్ఞానాన్ని, మంచి అలవాట్లను, వినయం విధేయత క్షమ సహనం కరుణ వంటి సుగుణాలను ప్రస్తావించే ఈ సామెతలు "యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట తెలివికి మూలము" అనే విషయాన్ని స్మరణకు తెస్తున్నాయి.

**విషయసూచిక**

జ్ఞాన ప్రశంస 1:1–9:18

సొలొమోను సామెతలు 10:1–29:27

అగూరు సామెతలు 30:1–33

పలు సూక్తులు 31:1–31

**ప్రసంగి**–పరిచయం

మానవ జీవితం అశాశ్వతమని మరియు పరస్పర విరుద్ధమైనదని భావిస్తూ, అది వివరించ శక్యంకాని అన్యాయంలోను నైరాశ్యంతోను నిండి వుంది గనుక “వ్యర్థము” అని క్లుప్తీకరించిన తత్వజ్ఞుని తలంపులు ప్రసంగి గ్రంథం. రచయిత తలంపుల్లో నిరసనభావం వ్యాకులత కనిపిస్తున్నప్పటికీ, అతను మనుషులు భూమ్మీద కష్టపడి పని చేయాలని దేవుడిచ్చినవాటిని సమృద్ధిగా అనుభవించాలని చెబుతున్నాడు.

**విషయసూచిక**

అన్నీ వ్యర్థమే 1:1–11

జీవితం వ్యర్థమే 1:12–6:12

దేవునికి భయపడడం 7:1–12:14

**పరమగీతము**–పరిచయం

పరమగీతము ప్రణయగీతాలు పరంపర. ఈ గీతాల్లో కనిపించే ఇరువురు స్త్రీ పురుషుల పరస్పర సంభాషణలను యూదులు దైవునికి ఆయన ప్రజలకు మధ్యనున్న సంబంధానికి, క్రైస్తవులు క్రీస్తుకు ఆయన సంఘానికి మధ్యనున్న సంబంధానికి సాదృశ్యంగా భావిస్తారు.

**విషయసూచిక**

మొదటి గీతం 1:1–2:7

రెండవ గీతం 2:8–3:5

మూడవ గీతం 3:6–5:1

నాల్గవ గీతం 5:2–6:3

అయిదవ గీతం 6:4–8:4

ఆరవ గీతం 8:5–14

**యెషయా**–పరిచయం

యెషయా అనే ఈ గ్రంథనామం క్రీస్తు పూర్వం ఎనిమిదవ శతాబ్దపు ద్వితీయార్ధంలో యెరూషలేములో జీవించిన ఒక గొప్ప ప్రవక్తను సూచిస్తోంది. ఈ గ్రంథంలోని మూడు ముఖ్యభాగాలు:

1–39 అధ్యాయాల్లో దక్షిణరాజ్యమైన యూదాకు శత్రువైన అష్షూరు రాజునుండి భయోత్పాతమైన బెదిరింపులు కనిపిస్తాయి. అయితే, దీన్ని శత్రువు బలమని కాక, తన ప్రజల పాపఫలితమని అవిధేయతా ఫలితమని భావించిన ప్రవక్త ప్రజలను వారి అధిపతులను నీతిన్యాయాలు కలిగివుండమని కోరుకుంటూ, దేవుని మాటలను లక్ష్యపెట్టక పోయినట్లయితే వినాశనం తప్పదని హెచ్చరిస్తూ, దావీదు వంశంలో జన్మించబోయే రాజు విశ్వంలో శాంతిని స్థాపిస్తాడనే ఆశాభావాన్ని వెల్లడిస్తాడు.

40–55 అధ్యాయాల్లో యూదా ప్రజలు బబులోను చెరలో నిరాశానిస్పృహల మధ్య ఉండడం కనిపిస్తుంది. అయితే దేవుడు తన ప్రజలను చెరనుండి విడిపించి యెరూషలేముకు నడిపించి నూతన జీవితాన్నిస్తాడనే ఆశాభావాన్ని ప్రవక్త తెలియజేస్తున్నాడు.

56–66 అధ్యాయాలు యెరూషలేముకు తిరిగి చేరుకున్న ప్రజలకు దేవుడు తన వాగ్దానాలను నెరవేరుస్తాడనే నిశ్చయత నిస్తున్నాయి. నీతి న్యాయం విశ్రాంతిదినాచరణ బల్యర్పణలు ప్రార్థన ఈ అధ్యాయాల్లో ప్రాముఖ్యంగా కనిపిస్తాయి.

**విషయసూచిక**

హెచ్చరికలు, మరియు వాగ్దానాలు 1:1–12:6

రాజ్యాల మీదికి వచ్చిన శిక్ష 13:1–23:18

దేవుడు లోకానికి తీర్చిన తీర్పు 24:1–27:13

మరి కొన్ని హెచ్చరికలు, మరియు వాగ్దానాలు 28:1–35:10

యూదా రాజు హిజ్కియా, మరియు అష్షూరీయులు 36:1–39:8

వాగ్దానం నిరీక్షణలను తెలిపే సందేశాలు 40:1–55:13

హెచ్చరికలు, మరియు వాగ్దానాలు 56:1–66:24

**(సశేషం)**



బ్రదర్ కె.సామ్రాట్



# మధ్యకాలము

**(ప్రవక్తయైన మలాకీ కాలము నుండి బాప్తిస్మమిచ్చు యోహాను వరకు గల మధ్యకాలములోని యూదుల చరిత్ర)**

ఈ సమయమున క్రీ.పూ. 160లో అల్సియస్ అను క్రూరమైన మతగురువు పక్షవాతముతో మరణించెను. థెమెత్రియస్ రోమా మత నాయకుల నుండి యూదులను హింసించుట మానమని ఆజ్ఞాపించిన ఉత్తరమును అందు కొనెను. మరియు బక్కిదేస్‌ను తిరిగి వెనుకకు పిలిపించిరి. అందువలన యోనాతాను తన కార్యములను తిరిగి క్రమ ముగా చేయగల్గిన పరిస్థితిని కనుగొనెను. కాని ఈ నెమ్మది కల్గిన స్థితి రెండు సంవత్సరముల వరకే ఉండెను. ఏలయనగా మాలొబనీయులు బక్కిదేస్‌ను అతని సైన్యముతో తిరిగి రమ్మని అతడు చేయుచున్న సాహసయాత్రకు వారు సహాయపడునట్లు, యోనాతానును మాత్రము ముట్టడి వేయవలెనన్న షరతుతో ఆహ్వానించిరి. కాని ఈ కూడిక జరుగకముందే ఈ సమా చారము యోనాతానుకు తెలియబడెను. అందువలన రహస్యా లోచన చేయుచున్న ముఖ్యమైన 50 మందిని పట్టుకొని చంపెను. బక్కిదేస్ ఎప్పుడైతే తన పెద్ద సైన్యముతో వచ్చాడో యోనాతాను అతని సహోదరుడు సీమోను అతనికి కష్టము కల్గించి అతని సైన్యమునకు నిరాశ కల్గించెను. గనుక బక్కిదేస్ ఈ యుద్ధములో విసుగు చెందెను. మరియు ఈ మరణ కరమగు సాహసయాత్రకు ఆహ్వానించిన వారు చివరకు మక్కబీయులతో సమాధానపడి బంధీలుగా ఉన్న అతని సైన్యమును తిరిగి ఇచ్చివేసి ఇంకెన్నడు యూదులను బాధ పెట్టుము అని ప్రమాణము చేసిరి.

యోనాతాను బక్కిదేస్ నుండి యూదయను సంపాదించిన తర్వాత అతను మతద్రోహులైన యూదులకు మరణశిక్ష విధించెను. సంఘమును, రాష్ట్రమును బాగుచేసెను. దేవాలయము యొక్క గోడలను, యెరూషలేము యొక్క గోడలను, యెరూషలేము యొక్క ప్రాకారములను తిరిగి నిర్మించెను. రోమా సామ్రాజ్యము సహాయముతో హెరాక్లిడిస్ నిర్వహకత్వములో తన తండ్రిగా నటించిన అంతియొకస్ ఎపిఫనెస్‌కు బదులుగా సిరియాదేశపు కిరీటమును పొందుటకు అలెగ్జాండరును ఎన్నుకొను సమయంలో ఏడు సం॥ల నుండి ప్రధానయాజకుడు లేనందున యోనాతాను యాజకుని అంగీ ధరించెను.

థెమెత్రియస్ యోనాతానుకు అనుకూలమైన అవకాశ ములు కల్గించినప్పటికీ ఈ వాగ్దానములు నిజముకావని కేవలం తాత్కాలిక పనుల కొరకేయని గ్రహించి క్రొత్తరాజును, అనుకూలమైన అలెగ్జాండరు యొక్క ప్రతిపాదనలను అంగీకరించెను. థెమెత్రియస్‌ను కొట్టి చంపెను. గనుక అలెగ్జాండర్ సిరియా సామ్రాజ్యమునంతటికి అధికారిగా ఉండెను. మరియు అతడు ఐగుప్తు రాజైన టోలమీ యొక్క కుమార్తెయగు క్లియోపాత్ర యొక్క వివాహమునకు యోనాతానును ఆహ్వానించెను. మరియు అతనికి వ్యక్తిగతమైన గొప్ప సన్మానములతోపాటు యూదయలోని సైన్యమంతటికి సైన్యాధికారిగా మరియు తన యింటిని శుభ్రపరచుటలో ప్రధానమైన వ్యక్తిగా క్రీ॥పూ॥ 51 సం॥లో నియమించెను.

కాలొసిరియా గవర్నరైన అపొల్లొనియస్ ద్వారా త్వరలోనే ఈ అభివృద్ధి చెరపబడినది. ఇతడు థెమెత్రియస్‌తోను, అతని కుమారునితోను భాగము పొందెను. థెమెత్రియస్ కుమారుడు అతని సోదరుడు అతని సోదరుడైన అంతియోకస్‌తో శ్రమ కాలమందు క్రేతు పట్టణమందు దాగుకొనియుండి జామ్నియా వరకు సైన్యముతో నడచి యోనాతానుతో యుద్ధము చేయుదమని సవాలు చేసిరి. యోనాతాను 10,000 మంది పురుషులతో బయలుదేరి శత్రువు చేతినుండి యొప్పేను తీసికొని అపొల్లొనియస్ యుద్ధమును విరమింపచేసి అతనిని కొట్టి అజొటాస్ వరకు సైన్యాన్ని వెంటాడి 8,000 మంది పురుషులను

చంపిరి. దాగోను దేవాలయమును పట్టణమును కత్తిచేత, అగ్నిచేత పాడుచేసెను. అతడు అలెగ్జాండరు యొక్క ప్రేమను పొందెను. గనుక అతనికి పర్షియా రాజకుటుంబము యొక్క గుర్తు అయిన ఒక బంగారు లోహమును పట్టణమును ఎక్రాను పరిసర ప్రాంతములను ఇచ్చెను. తరువాత సిరియాలో ఒక ఆశ్చర్యమైన తిరుగుబాటు జరిగెను. అలెగ్జాండరు అతనికి సహకారిగా టోలమీ ఫిలోపేటర్‌ని పిలిచెను.


తన కుమారుడు అలెగ్జాండరు తన మరణమునకై కుట్ర చేయుచు తన కుమార్తె క్లియోపాత్రను వివాహమాడెనని అనుమానముతో ఆమెను అలెగ్జాండరు పోటీదారుడైన థెమెత్రియస్‌కి ఇచ్చి అలెగ్జాండరునుండి తన హస్తములు వెనుకకుచాచి థెమెత్రియస్‌ను తన పూర్వీకుల సింహాసనము మీద యుంచెను. పూర్వ విజయము నొందిన తర్వాత అలెగ్జాండరును అరేబియాకు పారిపోవునట్లు బలవంతము చేసెను. మరియు ఆ దేశపు రాజైన జబ్దియా అతని తలను నరికి టోలమీకి పంపెను. ఈ సంఘటన క్రీ॥పూ॥ 14వ సం॥లో జరిగెను.

ఈ థెమెత్రియస్ విజయశీలుడైన నికనార్‌ను అనుకరించి యోనాతానును ఒక నేరము విషయమై సమాధానము ఇవ్వమని పిలువబడినప్పటికీ ఈ ప్రధాన యాజకుడు ఆయన గౌరవము పొందుకొనెను. మొదటి విషయమును నిర్ధారించు కొనుటయే గాక అనేక ఆధిక్యతలు ఇవ్వబడెను. మరియు అక్రా నుండి అన్యులైన భద్రతా సైన్యమును తొలగించుటకు కూడ ప్రమాణము చేయబడెను. ఆ విధంగా యోనాతానుకు సిఫారసు చేయబడెను. అప్పుడు థెమెత్రియస్ అంతియోకస్ నివాసులు ద్వారా చంపబడు అపాయములో ఉండగా అతడు 3000 మంది పురుషులతో రాజదర్బారుకు వెళ్ళి పట్టణము లోని అధిక భాగమును కాల్చి ఒక లక్షమంది ప్రజలను అగ్నితోను, కత్తితోను చంపి మిగిలిన వారిని రాజు కనికరము చొప్పున వదిలి వేసిరి. ఎప్పుడైతే ఈ యుద్ధ భీభత్సము ఆగిపోయినది తెలిసినదో ఈ కార్యములన్నిటినీ ప్రమాణాలను థెమెత్రియస్ మరిచిపోయెను. మరియు ఆ ప్రమాణములకు వ్యతిరేకముగా అతడు సైనిక చర్య ప్రకారము సామాన్యపు పనులు, శిస్తులు వారి పూర్వీకులవలె కట్టమని వత్తిడి చేసెను. కాని ఈ చర్యను రాజసభకు చెందిన రాజద్రోహియగు ట్రిఫాన్ అను నతనిచే ఆపివేయబడెను. ట్రిఫాన్ క్రీ.పూ. 144లో మొదట ప్రకటించి చనిపోయిన అలగ్జాండరు కుమారుడైన అంతియోకస్ అనువానిని థెమెత్రియస్‌ని ఓడించి సెల్యూ షియాలో విశ్రాంతి తీసుకొనుమని బలత్కరించిన తరువాత అతనిని సిరియా సింహాసనముపై ఉంచెను. యోనాతాను అతని సొంత ఇష్టానుసారముగా క్రొత్త రాజుగా ప్రకటించుకొని తన యాజకత్వమును నిరూపించుకొనెను. అతని తమ్ముడైన సీమోను తూరు నుండి ఐగుప్తు ప్రాంతము వరకు ఉన్న సైన్యమంతటికి రాజాయెను.

యోనాతాను యొక్క తిరుగుబాటును వినినంతనే థెమెత్రియస్ అతనిని వెంటాడుటకు ప్రారంభించెను. కాని అది అతనికి నష్టము కలిగించెను. అతను రెండుసార్లు ఓడింపబడి గాజాను పోగొట్టుకొని ఫిలిష్తీయుల ప్రాంతములో ఉన్న దమస్కు నుండి యొప్పే వరకు దేశమంతటిని పోగొట్టుకొనెను.

ట్రిఫాన్ ఆ ముసుగును తీయుటకు నిశ్చయించు కొనెను. కాని యోనాతాను తొలగింపబడు వరకు అటువంటి నేరము చేయుటకు ధైర్యము లేక ఒక వెయ్యిమంది సైన్యముతో టోలమియాస్ వరకు అతని సైన్యమును ఓడించుటకై వెంటాడెను. సైన్యము కత్తితో చంపబడెను. మరియు యోనాతాను బంధింపబడెను. యూదయవైపు వెళ్ళుచుండగా వంద తలాంతులను ఇచ్చినట్లయితే యోనాతానును తిరిగి ఇస్తానని మరియు నిర్బంధమునకు యివ్వవలెనని కోరెను. కాని యోనాతాను ఈ విషయమై అంగీకరించక వారి మీద తిరగబడెను. అందువలన ఆ క్రూరుడు యోనాతానును అతని కుమారులను కూడా చంపి సిరియా సామ్రాజ్యము రాజుగా ఊహించుకొనెను. సీయోను క్రీ.పూ. 143 సం॥లో తన అన్న చంపబడెనని గిలాదులోని ఒస్కామాలో పాతిపెట్ట బడెనని తెలిసినవాడై కొందరిని పంపి అక్కడనుండి తెప్పించి తెల్లని చలువరాతితో చేయబడిన జ్ఞాపకచిహ్నమందు "మోదీన్" లో ఉంచెను. తర్వాత అన్నస్థానములో ఇతను గవర్నరుగా ఉండి థెమెత్రియస్‌కు సేవలు అందించెను. తరువాత తోవదీసియాలో ఉన్న యూదులు కిరీటము పొందుటకు సహకరించెదమని వాగ్ధనము చేయగా అధికారిగా ప్రధాన యాజకునిగా విశిష్ఠ సేవలు ప్రజలకు అందించెను.

**(సశేషం)**




# సంఘములు

ప్రియ పరిశుద్ధత పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు నామమున శుభాభి వందనములు. ఈ సంచికలో పరిశుద్ధ గ్రంథమందు తెలుపబడిన సంఘములను గూర్చి తెలుసుకుందాము.

**1. యెరూషలేము సంఘము:-**

అ. పెంతెకొస్తు పండుగ దినమున ఇంచుమించు-అపొ.కా 2:41,47; 15:13

3,120 మందితో (2:41) ప్రారంభమైన (2:47) ఈ సంఘమునకు ప్రభువైన యేసుక్రీస్తు మారు సహోదరుడైన యాకోబు బోధకునిగా పనిచేసెను.

ఆ. అనేక మహత్కార్యములు, సూచన క్రియలు-అపొ.కా 2:43; 15:12-16. అపొస్తలుల ద్వారా జరిగినవి.

ఇ. కలిగినదంతయు సమిష్టిగా ఉంచుకొనిరి-అపొ.కా. 2:44,45; 4:32-35

ఈ. ఏకమనస్కులై యుండిరి-అపొ.కా2:46

ఉ. ప్రార్థన చేయుటయందు ఎడతెగక యుండిరి-అపొ.కా. 2:42; 3:1; 4:24;12:5-17

ఊ. ప్రతి అవకాశమును సద్వినియోగము చేసుకొనిరి-అపొ.కా 3:12; 5:42; 4:33

ఎ. యేసుతో కూడ ఉండిరి-అపొ.కా 4:13, 6:15

ఏ. దేవుని ద్వారా నీతిమంతులై యుండిరి-అపొ.కా. 5:1-11; 8:18-24

ఐ. సంఘము దినదినము అభివృద్ధి నొందెను-అపొ.కా. 2:47; 4:4; 5:14; 12:24

ఒ. హింసలు, శ్రమలు అనుభవించిరి-అపొ.కా 4:1-3; 4:14-21; 5:17-41; 7:54-60; 8:1-3; 12:1-4

ఓ. సేవకులను నియమించిరి. అపొ.కా 6:1-7

ఔ. బాప్తిస్మములు ఇచ్చుచు, రొట్టె అపొ.కా 2:41,46 విరుచుటను అవలంబించిరి.

అం. సువార్తికులను పంపిరి. అపొ. 8:5,14; 11:22; 13:1-3; 15:22,27

అః. రక్షణ పొందుటకు "సున్నతి" పొందవలెనని యూదయ నుండి వచ్చిన కొందరు బోధించినప్పుడు అపొస్తలుల, పెద్దల, సహోదరుల సమావేశము సంఘములో జరిగినది. అపొ.కా 15

క. పరిశుద్ధాత్మచే నడిపింపబడిరి. అపొ.కా 2:1-18; 4:31; 13:2-4;15:28

ఖ. దేవుని వాక్యమును బోధించిరి. అపొ.కా 2:16-36; 3:13-26;7:1-53; 6:4; 5:42

గ. నిజ విశ్వాసము కొరకు పోరాడిరి. అపొ.కా 15:1-21

ఘ. యూదులతో సమాధానపడిరి. అపొ.కా 21:8-25

**2. సిరియాలోగల అంతియొకయ సంఘము:-**

అ. ఈ సంఘము హింసాకాలములో అనగా స్తెఫను హతసాక్షిగా మరణించిన తరువాత ఉద్భవించినది. అపొ.కా 11:19

ఆ. నమ్మిన వారనేకులు ప్రభువు తట్టు తిరిగిరి-అపొ.కా. 11:21

ఇ. యెరూషలేము సంఘము బర్నబాను పంపెను-అపొ.కా. 11:22

ఈ. బర్నబా ఈ సంఘమునకు మొదటి బోధకుడయ్యెను-అపొ.కా. 11:23

ఉ. ఆ కాలములో సంఘమునకు అనేకమంది ప్రజలు చేర్చబడిరి-అపొ.కా. 11:24

ఊ. బర్నబా సహ బోధకునిగా పౌలును ఈ సంఘమునకు

తోడుకొని వచ్చెను. అపో.కా 11:25

ఎ. వీరిద్దరు కలిసి ఒక సంవత్సరము పాటు ఈ సంఘములో పనిచేసిరి. అపో.కా 11:26

ఏ. ఈ సంఘములోనే మొట్టమొదట శిష్యులు క్రైస్తవులన బడిరి. అపో.కా 11:26

ఐ. అగబు అనునతడు గొప్ప కరువు రాబోవుచున్నదని ఆత్మద్వారా సూచించగా ఈ సంఘపు వారు ప్రేమతో విస్తారమైన కానుకలు పంపిరి.అపో.కా 11:27-30

ఒ. మొదటి క్రైస్తవ సువార్తీకుడైన బర్నబా, పౌలులకు అంతియొకయ స్థానిక సంఘము.అపో.కా 13:1-3; 14:26

ఓ. కాలక్రమేగా ఈ ఇద్దరికి అంతియొకయ సంఘము కేంద్ర స్థానమైనది. అపో.కా 14:26; 15:35

ఔ. సీల ఈ సంఘమునకు చెందినవాడు. అపో.కా 15:34

అం. పేతురు సువార్తకంటే క్రైస్తవ సిద్ధాంతముల కివ్వవలసిన ప్రాధాన్యతను పౌలు ఈ సంఘములోనే బలపరచెను. గలతీ. 2:11

**<u>3. పిసిదియలోనున్న అంతియొకయ సంఘము:-</u>**

అ. సువార్తికునిగా పౌలుచేసిన మొదటి ప్రయాణములో ఈ సంఘము ప్రారంభమయినది. అపో.కా 13:14

ఆ. లిఖించబడిన మొదటి ప్రసంగమును అపొస్తలుడైన పౌలు ఈ సంఘములో బోధించెను. అపో.కా 13:16

ఇ. పౌలు ప్రసంఘము వినిన తరువాత అనేకమంది ఈ సంఘమునకు చేర్చబడిరి. అపో.కా 13:43

ఈ. ఈ సంఘము యొద్దకే పౌలు యూదుల నుండి విడిపోయెను. అపో.కా 13:46

ఉ. ఈ సంఘము యొద్దనే అపొస్తలుడైన పౌలు తన పరలోక పిలుపును ఉదహరించెను. అపో.కా 13:47

**<u>4. లుస్త్ర సంఘము:-</u>**

అ. ఈ సంఘము సువార్తికునిగా పౌలు చేసిన మొదటి ప్రయాణములో ఏర్పడినది. అపో.కా 14:6

ఆ. ఇచ్చట పౌలు ఒక కుంటి వానిని స్వస్థపరచెను. అపో.కా 14:10

ఇ. ఈ సంఘటన ద్వారా ప్రజలు పౌలును ఆరాధించిన పనిచేసిరి. అపో.కా 14:11

ఈ. ఇచ్చట పౌలు రాళ్ళతో కొట్టబడెను. అపో.కా 14:19; 2 తిమోతి 3:11

ఉ. ఈ సంఘము నుండి పౌలు సువార్తికునిగా తన రెండవ ప్రయాణములో తిమోతిని తనతో కూడ వెంటబెట్టుకొని ప్రయాణించెను. అపో.కా 16:1-3

**<u>5. దెర్బే సంఘము:-</u>** అపో.కా 4:20-22

**<u>6. ఈకొనియ సంఘము:-</u>**

అ. ఈకొనియలో అపొస్తలుడైన పౌలు సువార్తికునిగా తన మొదటి ప్రయాణములో అనేకులను క్రీస్తునొద్దకు నడిపించెను. అపో.కా 14:1

ఆ. ఇచ్చట పౌలు కూడ అనేక సూచన క్రియలను అద్భుత ములను ప్రభువు పేరట జరిగించెను. అపో.కా 14:3

ఇ. పౌలు ఇచ్చట అవిశ్వాసులైన యూదుల నుండి అన్య జనులనుండి తప్పించుకొని పారిపోయెను. అపో.కా 14:5,6

**7. ఫిలిప్పీ సంఘము:-**

అ. ప్రభువైన క్రీస్తులో విశ్వాసముంచిన లూదియ అను దైవ భక్తిగల స్త్రీ ఇంటిలో అపొస్తలుడైన పౌలు ఈ సంఘమును ఏర్పాటు చేసెను. అపో.కా 16:18,40

ఆ. తరువాత పౌలు ఒక దయ్యము పట్టిన చిన్నదానిని క్రీస్తులోనికి నడిపించెను. అపో.కా 16:18

ఇ. ఈ పట్టణ చెరసాల నాయకుదు అతని ఇంటివారందరును బాప్తిస్మము పొందిరి. అపో.కా 13:23

ఈ. కొంతకాలమునకు పౌలు ఈ సంఘమునకు ఒక పత్రిక (ఉత్తరము) వ్రాసెను. ఫిలిప్పీయులకు 1:1

ఉ. తిమోతి ఈ సంఘములో సేవచేసెను. ఫిలిప్పీ. 2:19

ఊ. అపొస్తలులు చెరసాలలో బంధించబడినప్పుడు ఈ సంఘము ఎపఫ్రొదితును సేవచేయుటకు పౌలుయొద్దకు పంపెను. ఫిలిప్పీ. 2:25

ఎ. నిజ విశ్వాస సిద్ధాంతములలో ఈ సంఘము అపాయ మును ఎదుర్కొనెను. ఫిలిప్పీ. 3:1-3

ఏ. సంఘ సహోదరీలైన యవొదియ, సుంటుకే ప్రభువు నందు ఏక మనస్సుగలవారైయుండుటకు సహాయపడవలెనని తన సహకారులకు పౌలు వ్రాసెను. ఫిలిప్పీ. 4:1-3

ఐ. ఈ సంఘము పౌలునకు సహాయము చేసెను. ఫిలిప్పీ. 4:15,18

**8. థెస్సలొనీక సంఘము:-**

అ. సువార్తికునిగా అపొస్టలుడైన పౌలు రెండవ పర్యటనలో ఈ సంఘము కనుగొనబడినది-అపొ.కా. 17:1

ఆ. అనేక ఆత్మలు చేర్చబడినవన్ని సాక్ష్యమియ్యబడెను-అపొ.కా. 17:4

ఇ. భూలోకమును తలక్రిందు చేసిన వానిగా పౌలు ఇచ్చట ఆరోపించబడెను-అపొ.కా. 17:6.

ఈ. పౌలు సీలలు బెరయకు పంపబడిరి-అపొ.కా. 17:10

ఉ. కొంతకాలము తరువాత పౌలు ఈ సంఘమునకు 1థెస్సలొనీక. 1:1 రెండు పత్రికలు వ్రాసెను. 2థెస్సలొనీక 1:1

ఊ. ఈ విశ్వాసములో ఈ సంఘము వారు గొప్ప ఖ్యాతి కలిగియుండిరి-1థెస్సలొనీక. 1:8

ఎ. ఏ సంఘము వారు తమ విశ్వాసమునుబట్టి అవిశ్వాసులైన యూదులనుండి హింసలు శ్రమలు అనుభవించిరి-1థెస్సలొనీక. 2:14

ఏ. తిమోతి ఈ సంఘములో బోధించెను. 1థెస్సలొనీక . 3:1,2

ఐ. ఈ సంఘములో కొందరు సోమరులు కలరు-2థెస్సలొనీక 3:10

ఒ. ఈ సంఘములో కొందరు పరుల జోలికి పోవుచు, క్రమముగా నడుచువారు కలరు-2థెస్సలొనీక. 3:11.

ఓ. ఈ సంఘములో కొందరు అవిధేయత కలవారు గలరు. 2థెస్సలొనీక. 3:14,15.

**9. బెరయ సంఘము:-** ఈ సంఘము వారు థెస్సలొనీక సంఘము వారికంటే ఘనులైయుండి ఆసక్తితో దేవుని వాక్యమును అంగీకరించిరి. అపొ.కా. 17:11

**10. ఏథెస్సు సంఘము:-** పౌలు అరేయొపగు కొండల మీద చేసిన ప్రసంగము వినుట ద్వారా ఈ సంఘము ఉద్భవించి నదని చెప్పుట కష్టము ఒకవేళ ఆ విధముగా జరిగియుంటే క్రీస్తు నంగీకరించినది యొనూసి ఈ సంఘమును నడిపించెను. అపొ.కా 17:34

**11. కొరింథు సంఘము:-**

అ. సువార్తికునిగా పౌలు చేసిన రెండవ పర్యటనలో ఈ సంఘము కనుగొనబడినది. అపొ.కా 18:11

ఆ. అకుల, ప్రిస్కిల్లలు పౌలును ఆదరించిరి. అపొ.కా 18:2,3

ఇ. యూదుల సమాజ మందిరపు అధికారియైన క్రిస్పు ప్రథమముగా క్రీస్తును అంగీకరించిన వారిలో ఒకడు. అపొ.కా 18:8

ఈ. క్రిస్పు తరువాత సమాజ మందిరపు అధికారియైన సొస్తెనేను కూడ కొంతకాలమునకు అపొ.కా 18:17 స్పష్ట ముగా క్రీస్తును అంగీకరించెను. 1కొరింథీ 1:1 చూడుము

ఉ. పౌలు ఇచ్చట 18 నెలలు నివసించెను. అపొ.కా 18:11

ఊ. ఈ సంఘమునకు పౌలు అనేక పత్రికలు (ఉత్తరములు) వ్రాసెను. వాటిలో రెండు 1కొరింథీ 5:9 పత్రికలు క్రొత్త నిబంధనలో చేర్చబడినవి. 2కొరింథీ 10:9,10

ఎ. ఈ సంఘము సిద్ధాంత పరముగా అనేక విషయములలో కలవరపరచబడినది. అవి:- 1. బాప్తిస్మము విషయములో 1కొరింథీ 1:12

2. లోక జ్ఞానము విషయములో-1కొరింథీ. 1:26.

3. శారీరకముగా మరియు జగడముల విషయములో-1కొరింథీ 3:1-3

4. ఇతరులను నిష్పక్షపాతముగా తీర్పు తీర్చు విషయములో-1కొరింథీ. 4:7.

5. జారత్వము విషయములో-1కొరింథీ. 5:1.

6. ఇతర విశ్వాసులను లోకానుసారమైన న్యాయసాధనముల కీడ్చు విషయములో-1కొరింథీ. 6:1-4.

7. వివాహము విషయములో-1కొరింథీ. 7:1.

8. క్రైస్తవ స్వేచ్ఛ విషయములో 1కొరింథీ. 8,9 అధ్యాయములు

9. ప్రభు రాత్రి భోజనము విషయములో-1కొరింథీ. 11:17-34

10. ఆత్మీయ వరముల విషయములో-1కొరింథీ. 12-14 అధ్యాయములు

11. క్రీస్తు పునరుత్థానము విషయములో 1కొరింథీ 15 అధ్యాయము

12. దశమభాగము విషయములో 1కొరింథీ 16 అధ్యాయము

ఏ. కొంతకాలము తరువాత ఈ సంఘమునకు అపొల్లొ కాపరిగా ఉండెను. 1కొరింథీ 3:6



# అబద్ధములు మరియు మోసములు

శ్రీమతి రిబ్కా విక్రాంత్

ప్రియ పరిశుద్ధత పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు నామమున శుభాభి వందనములు.

ఈ సంచికలో పరిశుద్ధ గ్రంథమందు తెలుపబడిన అబద్ధములు మరియు మోసములు గూర్చి తెలుసుకుందాం.

1. సాతాను "మీరు చావనే చావరు" అని చెప్పి హవ్వను మోసగించెను - ఆదికాండము 3:4
2. అబ్రహాము తన భార్యయైన శారా "తన సహోదరి" అని చెప్పి ఫరోను మోసగించెను - ఆదికాండము 12:13
3. అబ్రహాము తన భార్యయైన శారా "తన చెల్లెలు" అని చెప్పి అబిమెలెకును మోసగించెను - ఆదికాండము 20:2
4. శారా దేవునితో "నేను నవ్వలేదని" అబద్ధము చెప్పెను - ఆదికాండము 18:15
5. "నేను ఏశావు అను నీ జ్యేష్ఠ కుమారుడను" అని చెప్పి యాకోబు ఇస్సాకును మోసగించెను - ఆదికాండము 27:19
6. ఇస్సాకు తన భార్యయైన రిబ్కా "నా సహోదరి" అని చెప్పి అబీమెలెకును మోసగించెను - ఆదికాండము 26:7
7. లాబాను రాహేలుకు బదులు లేయాను ఇచ్చి యాకోబును మోసగించెను - ఆదికాండము 29:18-26
8. యాకోబు యొక్క కుమారులు యోసేపు యొక్క విచిత్రపు నిలువుటంగీని యాకోబుకు చూపించి "ఇది మాకు దొరికెను, ఇది నీ కుమారుని అంగీకాదో అవునో గురుతుపట్టుము అని చెప్పి మోసగించిరి - ఆదికాండము 37:32
9. పోతీఫరు భార్య "నీవు మన యొద్దకు తెచ్చిన ఆ హెబ్రీ దాసుడు నన్ను ఎగతాళి చేయుటకు నా యొద్దకు వచ్చెను. నేను బిగ్గరుగా కేకవేసి నప్పుడు వాడు తన వస్త్రము నా దగ్గర విడచిపెట్టి తప్పించుకొని బయటకు పారిపోయెను అని తన భర్తకు యోసేపు గూర్చి అబద్ధము చెప్పెను - ఆదికాండము 39:17,18
10. ఫరోను యొద్దనుండి నా జనులయొద్ద నుండి ఈ కప్పలను తొలగించుమని యెహోవాను వేడుకొనుడి అప్పుడు యెహోవాను బలి అర్పించుటకు ఈ ప్రజలను అగత్యముగా పోనిచ్చెదను అని మోషేకు అబద్ధము చెప్పెను - నిర్గమ కాండము 8:8
11. అమాలేకీయుడగు ఒక సైనికుడు దావీదుకు అబద్ధము చెప్పెను - 2 సమూయేలు 1:2-10
12. దావీదు రాజు పని వేగిరముగా జరుగవలెనని యెరిగి నా ఖడ్గమునైనను ఆయుధములనైనను నేను తేలేదు. ఇక్కడ నీయొద్ద ఖడ్గమైనను ఈటేయైనను ఉన్నదా? అని అహీమెలెకును మోసము చేసెను - 1 సమూయేలు 21:8
13. దావీదు వెఱ్ఱివానివలె నటించి ఆకీషు రాజును మోసగించెను - 1 సమూయేలు 21:13
14. రాహాబు అను వేశ్య యెహోషువ పంపిన వేగుల వారిని దాచి "ఆ మనుష్యులు నా యొద్దకు వచ్చిన మాట నిజమే, కాని వారు చీకటి పడుచుండగా వెళ్ళిపోయిరి" అని యెరికో పట్టణ సైనికులను మోసగించెను - యెహోషువా 2:4,5
15. మీకాలు తన తండ్రియైన సౌలును మోసగించెను - 1 సమూ 19:13-17
16. సౌలు "నాపెద్ద కుమార్తెయైన మేరబును నీకిత్తును" అని దావీదును మోసగించెను - 1 సమూ 18:17-19
17. అననీయ, సప్పీరాలు పేతురుకు అబద్ధములు చెప్పి పరిశుద్ధాత్ముని మోసపుచ్చుటకు ప్రయత్నించిరి - అపొ.కా 5:1-6

# సాక్ష్యము

**జెరోము (హింస, హతసాక్షి మరణము) – క్రీ.శ. 1416 :** ప్రేగ్ నివాసియైన జెరోము క్రీ.శ. 1370లో జన్మించెను. ఇతడు బొహెమియా సంఘ సంస్కర్త. సంచార పండితుడు. వివిధ పట్టణములలోని అనేక విశ్వవిద్యాలయ చర్చలలో ఇతడు పాల్గొనెను. ప్రేగ్, పారిస్ హైడెల్‌బర్గ్, కొలొన్, మరియు ఆక్స్‌ఫర్డ్ పట్టణములలోని చర్చలలో పాల్గొనుటద్వారా అతనికి చక్కని ఆంగ్లము మాట్లాడుట వచ్చెను. ఆక్స్‌ఫర్డ్‌లో జాన్‌విక్లిఫ్ రచనలతో పరిచయము కలిగి, వాటిని ఆంగ్లము నుండి చెక్ భాషలోనికి తర్జుమా చేయగా అతని పుస్తకములు బొహెమియా అంతట వ్యాపించెను. జెరోము బొహెమియాకు తిరిగివచ్చినపుడు అతని గ్రంథములు పట్టణములోను, విశ్వవిద్యాలయములోను విస్తృతముగా చదువబడుట చూచెను. విక్లిప్ రచించిన ఉపదేశములను జాన్‌హస్ వ్యాప్తిచేయుచున్నందున జెరోము వెంటనే హస్ సహవాసము చేసెను. అప్పటినుండి వారిద్దరు ఆ సేవలో కలిసి పనిచేసిరి.

కాన్‌స్టాన్స్ సభలో హస్ బంధింపబడి, చెరసాలలో ఉన్నప్పుడు జెరోము కాన్‌స్టాన్స్ వెళ్ళెను. హస్ కాల్చివేయ బడుటకు మూడు నెలల ముందు అనగా క్రీ.శ. 1415, ఏప్రిల్ 4న అతడక్కడకు వెళ్ళెను. తాను కూడా ఖైదు చేయబడుదునను భయముతో రహస్యముగ ఆ పట్టణములో ప్రవేశించి, విక్లిఫ్ సిద్ధాంతములను విశ్వసించిన కొందరు నాయకులను సంప్రదించెను. హస్‌ను సజీవదహనము చేయవలెనను సభ తీర్పును మార్చుట అసాధ్యమని ఆ నాయకులు తెలుపగా జెరోము చక్రవర్తియైన సిజిస్మండ్ సంరక్షణలోనున్న ఐబెర్లింగ్ అను రాజనగరికి వెళ్ళెను. తనకు ఏవిధమైన హాని కలుగదని చక్రవర్తి హామీ ఇచ్చినట్లయితే తాను హస్ పక్షముగ సభముందు హాజరగుదునని చక్రవర్తికి ఉత్తరము వ్రాయగా, అది నిరాకరింపబడెను. అదే విషయము కాన్‌స్టాన్స్ సభకు వ్రాయగా వారుకూడా తిరస్కరించిరి. కాని హస్‌కు బదులుగ తీర్పును వినుటకు కాన్స్‌స్టాన్స్ సభకు వ్రాయగా వారుకూడా తిరస్కరించిరి. కాని హస్‌కు బదులుగ తీర్పును వినుటకు కాన్‌స్టాన్స్, ఐబెర్లింగ్‌లలోని ప్రభువులు సంతకముచేసిన యోగ్యత పత్రములన్నింటిని తీసుకొని బొహెమియా చేరెను. అయితే రాజైన సల్ట్‌బాక్ ఆజ్ఞ ప్రకారము ఒక అధికారి జెరోమును జర్మనీలోని హిర్‌షా పట్టణములో అన్యాయముగ బంధించెను.

జెరోము బంధీగా ఉన్నందున అతనిని తక్షణమే తమ యెదుట హాజరుపరచవలెనని సభ తెలియజేసెను. జర్మనీ యువరాజు జెరోము కాళ్ళకు పొడవైన గొలుసు బిగించి, ఆ గొలుసు చివరి భాగమును తన మెడకు చుట్టుకొని ఆడంబరముగా కాన్‌స్టాన్స్‌కు గుఱ్ఱముమీద ప్రయాణించెను. దారిలో జెరోము అనేకమంది తన సహవాసులను కలుసు కొనెను. అతడు జెరోమును కాన్‌స్టాన్స్‌కు తీసుకొనిరాగా, అతనిని దుర్గంధపు గుహలో బంధించి న్యాయాధిపతులు సంతోషించిరి. హస్‌కు చేసిన విధముగానే జెరోముకు కూడ చేసిరి. అయితే ఇతనిని తక్కువకాలము బంధించి, వేరువేరు చెరసాలలకు మార్చెను. అతనిని బంధించిన సంవత్సరము తరువాత సభ ముందుంచిరి. అక్కడ అతనిని తన పక్షముగ వాదించుకొనుమని చెప్పి, మరల తిరస్కరించిరి. అందుకు జెరోము కోపముతో, గట్టిగా ఈ మాటలు పలికెను :

ఇదేమి క్రూరత్వము? సుమారు మూడువందల నలుబది ఐదు దినములు నేను వివిధ జైళ్ళలో బంధింపబడితిని. నేననుభవింపని దుఃఖము గాని, కష్టముగాని లేదు. వారు కోరినంతమేరకు నన్ను హింసించుటకు మీరు వారికి అప్పగించితిరి. నా పక్షముగ న్యాయమును నిరూపించుకొను చిన్న అవకాశము కూడ నాకు ఇవ్వనిరాకరించితిరి. తీర్పు కొరకు సిద్ధపడుటకు నాకు ఒక్క గంట వ్యవధి కూడ మీరు అనుగ్రహింపలేదు.

నాకు వ్యతిరేకమైన అతి దుర్మార్గపు ప్రకటనలను మీరు స్వీకరించితిరి. నా సిద్ధాంతము తెలియకుండనే నన్ను మతద్రోహిగా నిర్ధారించితిరి. నేను ఎట్టి నమ్మకము కలిగియున్నానో తెలియకుండానే నన్ను విశ్వాసమునకు విరోధియనుచున్నారు. నా ఉద్దేశ్యము గ్రహింపకుండగనే నన్ను బోధకుని చంపినవాడని నిందించితిరి.

మీలో ఈ ప్రపంచునకు బోధింపగలిగినంత విజ్ఞానము,

మంచితనము పవిత్రత ఉన్నవి. కాని మీరు ఇంకను మనుష్యులే. మనుష్యుల మాటలవలన మోసపోవుదురు. మూర్ఖత్వములోను, మోసములోను పడకుండునట్లు జాగ్రత్త కలిగియుండుడి. నేను వాదించకోరుకొను విషయము నా స్వంత విషయము, ప్రజల విషయము, క్రైస్తవుల విషయము. ఏరకమైన పద్ధతిని ఉపయోగించి మీరు పరీక్షించెదరో కాని, ఇది రాబోవు తరముల స్వేచ్ఛను, హక్కులను బాధించు విషయము."

జెరోము యొక్క హృదయవేదన సభపై ఎట్టి ప్రభావము చూపలేదు. అతడు మాట్లాడుట ముగించిన వెంటనే, అతనిపై ఐదు నేరారోపణలు జారీచేసిరి.

1. జెరోము సంఘ గౌరవమును పరిహసించెను.
2. పోప్‌ను వ్యతిరేకించెను.
3. మత ప్రధానాధికారులకు శత్రువు.
4. బిషప్‌ల హంతకుడు.
5. క్రైస్తవ మతద్వేషి.

జెరోము తనపై మోపిన నేరారోపణలనన్నింటిని తిరస్కరించగా, తిరిగి అతనిని జైలులో పెట్టి పదకొండు దినములు కాలిమడమలు పైకికట్టి తలక్రిందులుగా వ్రేలాడదీసిరి.

జెరోము గొప్ప భాషాపాండిత్యము, మిక్కిలి జ్ఞానము గలవాడు కనుక మాట్లాడుటకు అవకాశమిచ్చినచో ఎంతటి మతోన్మాదినైనను, కరుడుగట్టిన ద్వేషబుద్ధిగల వానినైనను మార్చగలడు. కనుక మాట్లాడుటకు అతనికి అవకాశమీయ కూడదని కొందరు అభిప్రాయపడిరి. అయినను సభ తన వాదనలోని న్యాయమును నిరూపించు కొను అవకాశము జెరోముకిచ్చెను. తనమీద నేరములు ద్వేషముతోను, అబద్ధము లతోను నిరూపించబడినవని చెప్పెను. తన జీవితము, నడవడి సభకు విడమరచి చెప్పెను. మహా ఘనులు, పవిత్రులైన మనుష్యుల అభిప్రాయములు కూడ కొన్నిసార్లు మారుననియు, కనుక బహిరంగముగ చర్చించుకొనిన వాస్తవములు గ్రహించవచ్చుననెను. విక్లిఫ్ సిద్ధాంతములు సత్యమైనవని నిరూపించి, హస్‌ను గొప్పగా శ్లాఘించెను. అట్టి పవిత్ర హతసాక్షుల ననుసరించి తాను కూడ చనిపోవుటకు సిద్ధముగా ఉన్నాని జెరోము విన్నవించెను. గతములోవలె, ఇప్పుడు కూడ సభ అతని మాటలకు లక్ష్యపెట్టలేదు.

జాన్ హస్‌వలె జెరోము కూడ దోషియని తీర్చబడి, మతద్రోహివలె కొయ్య స్తంభమునకు కట్టి కాల్చవలెనని ఆజ్ఞాపించిరి. అతడు హస్‌వలె పాదిరి కాదు గనుక అగౌరవపరచు కార్యములు చేయలేదు. తన మనస్సు మార్చుకొనుటకు సభ అతనికి రెండురోజుల వ్యవధినిచ్చెను. శాయశక్తుల కృషిచేసి, అతనిని ఒప్పించుటకు కార్డినల్ ఫ్లోరెన్స్ ప్రయత్నించెను. కాని జెరోము మాటలు సభపై ప్రభావము చూపనట్లే ఫ్లోరెన్స్ మాటలు కూడ జెరోము పై ఎట్టి ప్రభావమును చూపలేకపోయెను. ఉరికంబమునకు వెళ్ళుదారిలో జెరోము ఎన్నో స్తుతి గీతములు పాడెను. హస్‌ను సజీవ దహనము చేసిన అదే స్థలమునకు జెరోమును తీసుకొని వచ్చినపుడు అతడు మోకరించి పట్టుదలగా ప్రార్థించెను. గొలుసుతో కట్టబడక ముందే, కొయ్య స్థంభమును కౌగిలించుకొనెను. కట్టెలు అంటించుటకు హంతకుడు వెనుకకు వచ్చినపుడు, అతనిని పిలిచి, "నాకు ఎదురుగా వచ్చి నేను చూచునట్లు నిప్పుముట్టిం చుము. నేను భయపడను, భయపడి ఉంటే నేనీ స్థలమునకు వచ్చి ఉండేవాడను కాను" అని చెప్పెను.

నిప్పు ముట్టించబడెను. కట్టెలు బాగా ఎండిన వగుటచే, జ్వాలలు త్వరగా అతనిని చుట్టుముట్టెను. కొద్దిసేపు జెరోము స్తుతిగీతములు పాడెను కాని, రగులుచున్న అగ్ని అతనిని నిశ్శబ్ధపరచినది. ప్రత్యక్షసాక్షులు వినిన అతని చివరి మాటలు: "క్రీస్తూ ఈ మంటలలో నా ఆత్మను నీకు సమర్పించు చున్నాను.' ఇట్లు జెరోము క్రీ.శ. 1416, మే 30 న హతసాక్షి మరణమొందెను. మతన్యాయ నిర్ణేతలు ఏవిధముగా తలంచినను, అతని మరణజ్వాలలు సత్యసువార్తాగ్నిని నాగరిక ప్రపంచమంతట వ్యాపింపజేసెను. విక్లిఫ్ యొక్క ఆంగ్ల రచనలను జెరోము చెక్ భాషలోనికి తర్జుమా చేసి, ఆ విధముగ సత్యసువార్త విత్తనములను నాటెను. లేఖన జ్ఞానము సామాన్య ప్రజలకు దాచబడినందున, మతాధిపతుల లాటిన్ క్రొత్త నిబంధన గ్రంథమును ఆంగ్లములోనికి తర్జుమా చేయు మరియొక వ్యక్తిని దేవుడు తొందరలో లేవనెత్తగలడు. ప్రకటన 2:12లో పునరుత్థానుడైన క్రీస్తు పెర్గములో ఉన్న సంఘమునకు ఈలాగు వ్రాసెను : "మారుమనస్సు పొందుము, లేనియెడల నేను నీ యొద్దకు త్వరగా వచ్చి నా నోటినుండి వచ్చు ఖడ్గము చేత వీరితో యుద్ధము చేయుదును." ఇప్పుడు ఆత్మ ఖడ్గమైన దేవుని వాక్యము (ఎఫెసి 6:17), మారుమనస్సు పొందని సంఘము మీదకి రానైయుండెను.

# క్రిస్మస్

దూతలు రాత్రివేళ గొల్లలకు ప్రత్యక్షమయినప్పుడు వారు తమ మందను కాచుకొనుచున్నట్లు వ్రాయబడి ఉన్నది (లూకా 2:8) అయితే మనమందరము వారు చలికాచుచునట్లుగా ఆ భాగాన్ని తప్పుగా అర్థం చేసుకున్నాము. ఇక జ్ఞానులు నక్షత్రం చేత వారి దేశముల నుంచి నడిపించబడి హేరోదు దగ్గరికి వచ్చినట్లుగా చెప్పుకుంటాము. అయితే సత్యం ఏమిటంటే ఈ జ్ఞానులు అన్ని విద్యలలో ఆరితేరిన వారిగా గమనించాలి అంటే ఖగోళశాస్త్రం, జ్యోతిష్య శాస్త్రం, గణితమువంటి విద్యలలో ప్రవీణులు ఇంకను మహా భక్తిగలవారి ఉండి ఉన్న మునీశ్వరులు వీరు నక్షత్రమును కనుగొనగానే దాని విషయమై వారి వారి గ్రంథాలను పరిశీలించి లోక రక్షకుడు యూదుల రాజు జన్మించినాడని గ్రహించారు. యూదుల రాజు యూదా దేశపు రాజు గృహములోనే జన్మించి ఉంటాడని కానుకలు తీసుకొని ఆయనను దర్శించి పూజించుటకు యూదా దేశము వచ్చారు. నక్షత్రమును చూచి బయలుదేరి వచ్చామని చెప్పారు. హేరోదు తన ఆస్థానంలోని శాస్త్రులతో ప్రధాన యాజకులతో సంప్రదించి బెత్లేహేములో అని నిర్ధారణ చేశారు.

అయితే ఇప్పుడు క్రూరుడైన హేరోదు యూదులకు ఇంకొక రాజు పుట్టుట సహించక అతనిని అప్పుడే సంహరించ ఆలోచన చేసి జ్ఞానులను రహస్యముగా పిలిపించి యేసు పుట్టిన కాలమును పరిష్కారముగా తెలుసుకొని తిరిగి వచ్చి తనకు బాలుడైన యేసు యొక్క వివరములను తెలుపమని బేత్లెహేముకు సాదరంగా పంపించి వేశారు.

ఇప్పుడు ఈ జ్ఞానులు బేత్లెహేము వెళ్ళుటకు రాజు ఇంటి నుండి బయలుదేరగానే తూర్పు దేశమున వారు చూచిన నక్షత్రము మరలా వారికి ప్రత్యక్షమై యేసు ఉండిన చోటికి వారిని నడిపించింది.

**ఇక్కడ మనం గమనించవలసిన విషయాలు :-**

1. జ్ఞానులు వారి దేశమునుండి నక్షత్రము చేత నడిపించబడి ఉంటే హేరోదు ఇంటికి వెళ్ళేవారు కారు.

2. జ్ఞానులు చేత తను పరిష్కారము తెలుసుకొనిన కాలమును బట్టి 2 సం॥ల పిల్లలని హేరోదు ఆజ్ఞ. మత్త 2:16

రెండు సంవత్సరాలు యోసేపు మరియతో బేత్లెహేములో ఉండరు. వారు అక్కడకి జనాబా లెక్కల కొరకు వచ్చారు. అక్కడ వాళ్ళకు నెళవైన వారు లేరు. ఉంటే పశువుల పాకలో ఎందుకుంటారు? కనుక లూకా 2:39లో వ్రాయబడినట్లుగా గలలియలోని నజరేతుకు వెళ్ళిపోయారు.

ధర్మశాస్త్ర ప్రకారము సమస్తము తీర్చిన పిమ్మట అంటే సుమారు 40 లేక 41 రోజులన్న మాట. ఇప్పుడు జ్ఞానులు బేత్లెహేముకు బయలుదేరారు. అంటే మళ్ళీ తప్పు చేస్తున్నారు. అందుకని ఆ నక్షత్రము వారికి మరలా ప్రత్యక్షమై యేసు వున్న చోటుకు తీసుకుని వెళ్ళిందని గ్రహించాలి. గొల్లలు చూసినట్లుగా జ్ఞానులు కూడా యేసుని పశువులపాకలో చూడలేదు. ఒక ఇంటిలో చూచారు. అది కూడా పసిబిడ్డ అయిన యేసుని కాదు బాలుడైన యేసుని.

ఇంతకి ఇక్కడ విషయమేమంటే గొల్లలు తొట్టిలో పండు కొనిన పసిబిడ్డ అయిన యేసుని చూచారు. జ్ఞానులు బాలుడైన యేసుని ఇంటిలో చూచారు. మనం డ్రామాలలో సినిమాలలో చూస్తున్నట్లుగా గొల్లలు జ్ఞానులు ఒకేసారి చూడలేదు. తూర్పు దేశమునుండి ఆ రాత్రికి రాత్రే ఎట్లా వస్తారు. మధ్యలో హేరోదు దగ్గర కూడా కొన్ని రోజులు ఉన్నారు. మనము దిద్దుకొనవలసినది ఏమంటే నక్షత్రము తూర్పు దేశం నుండి జ్ఞానులను నడిపించ లేదు హేరోదు ఇంటి దగ్గర నుండి వారికి ముందుగా నడిచింది.

# తప్పులను దిద్దుకుందాము

ప్రియ పాఠకులకు ఈ క్రింది ఇవ్వబడిన అంశములను ప్రార్థన పూర్వకముగా యోచించి ఈ అంశములు సరైనవో కాదో తెలియజేయవలసినదిగా మనవి. బైబిల్‌లో ఉన్న సత్యములను సరైన తర్జుమా లేకపోవటం వలనను, సరిగా గ్రహించలేక పోవుట వలనను అర్థం చేసుకోవడంలో చాలా పొరపాట్లు జరుగుతున్నాయి.

**కొన్ని అంశాలను పరిశీలిద్దాం:-**

1) నోవహు ఎన్ని సంవత్సరాలు ఓడను కట్టారో ఎన్ని సంవత్సరాలు బోధించాడో మనకి తెలియదు. కాని చాలా మంది బైబిల్ పండితులు కూడా 120 సంవత్సరాలు కట్టారని, 120 సంవత్సరాలు బోధించాడని చెప్తూ ఉంటారు. అలాగే బైబిల్ కాలేజిలో కూడా బోధిస్తుంటారు.

**నిజాలు పరిశీలిద్దా :-**

నోవహుతో దేవుడు మాట్లాడినది ఏమంటే "అయితే నీతో నా నిబంధన స్థిరపరుచుదును. నీవును నీతో కూడా నీ కుమారులను నీ భార్యయు నీ కోడండ్రును ఆ ఓడలో ప్రవేశింపవలెను" (ఆది 6:18). ఇక్కడ మనకి ఏమి అర్థమవుతుందంటే నోవహుతో దేవుడు మాట్లాడినప్పటికి నోవహుకి ముగ్గురు కుమారులు వారికి పెళ్ళయ్యి కోడండ్రు కూడా ఉన్నారని అర్థమవుతుంది. ఇప్పుడు నోవహు మనవండ్ర సంతానం మనం చూసినట్లయితే నోవహు కుమారుడైన షేము నూరేళ్ళు గలవాడై జల ప్రవాహము గతించిన రెండేళ్ళకు అర్పక్షదును కనెను. (ఆది 11:10)

ఇప్పుడు గమనించండి దేవుడు నోవహుతో మాట్లాడి నప్పుడు అతనికి ముగ్గురు కుమారులకు పెళ్ళి అయ్యి ఉంది. తరువాత ఓడ కట్టటం జలప్రళయం రావడం జరిగింది. ఆ తరువాత పెద్ద కుమారుడైన షేము తన మొదటి బిడ్డ అర్పక్షదుని కనేటప్పటికి అతనికి నూరేళ్ళు. (ఆది 11:10)

అది కూడా జలప్రవాహం గతించిన రెండు సంవత్సరాలకు అంటే జలప్రళయం గతించి భూమి ఆరిపోయినప్పటికి షేముకు 98 సం॥ అన్న మాట. ఇక 120 సం॥ ఓడ కట్టటం, బోధించడం ఎట్లా జరుగుతుంది. విజ్ఞానులైన మీరే ఆలోచించండి.

# బైబిల్ క్విజ్-12 జవాబులు

1. ప్రత్యక్షపు గుడారపు ద్వారమునొద్ద
2. అర తులము
3. మరణ శిక్ష
4. 3000 మంది
5. హోరేబు కొండయొద్ద
6. 40 రేయింబగళ్ళు
7. హూరు
8. తుమ్మకఱ్ఱతో
9. ఆరు కొమ్మలు
10. దాను
11. యెహోవా పరిశుద్ధుడు
12. రెండవ సం॥ మొదటి నెల, మొదటి దినమున
13. తెల్లగువ్వ లేదా పావురపు పిల్ల
14. ఉప్పు
15. క్రొవ్వునైనను రక్తమునైనను
16. నిర్దోషమైన మగమేకపిల్లను
17. తూమెడు గోధుమపిండిలో పదియవవంతు
18. మూడుసార్లు
19. ఎద్దు, గొఱ్ఱె, మేక
20. రెండు (2), ఏడు (7), ఒకటి (1)
21. పాపపరిహారార్థబలి
22. ఉజ్జీయేలు
23. ఒంటె, పొట్టికుందేలు, కుందేలు
24. ఏడాది గొఱ్ఱెపిల్లను
25. 8 సార్లు



# అక్షరయజ్ఞం



శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

## బైబిల్ క్విజ్ - 13

లేవీయ. 14 నుండి సంఖ్యా. 11 వరకు

1. లేవీయకాండములో చిన్న అధ్యాయము ఏది?
2. లేవీయకాండములో పెద్ద అధ్యాయము ఏది?
3. లేవీయకాండములో 16వ అధ్యాయములో పేర్కొనబడిన తేదీ, నెల ఏది?
4. రక్తము తిను వానిని దేవుడు ఏమి చేయును?
5. లేవీయకాండములో 50 వచనాలకు పైగా ఉన్న అధ్యాయాలు ఎన్ని ఉన్నాయి?
6. 19వ అధ్యాయములో "నేను యెహోవాను" అను మాట ఎన్నిసార్లు ఉంది?
7. 20వ అధ్యాయములో పేర్కొనబడిన వేరొక దేవత పేరు ఏమిటి?
8. అహరోను సంతానములో ఎవరు దేవునికి హోమ ద్రవ్యములను అర్పించుటకు సమీపించకూడదు?
9. ఎంత వయస్సు ఉన్న జంతువును దేవునికి హోమముగా అర్పింపవలెను?
10. ఏ నెల ఏ దినము ఇశ్రాయేలీయులకు విశ్రాంతి దినము?
11. యెహోవా నామమును దూషించిన వాని తల్లి పేరు ఏమిటి?
12. ఏ సంవత్సరము ఇశ్రాయేలీయులకు సునాద సంవత్సరము?
13. 26వ అధ్యాయములో "నేను మీ దేవుడైన యెహోవాను" అన్న వాక్యము ఎన్నిసార్లు ఉంది?
14. ఒకడు తన దశమ భాగమును విడిపింపగోరిన యెడల దానికి ఎంత కలుపవలెను?
15. ప్రతి గోత్రములో లెక్కించిన 20 సం॥ల పైబడిన వారు ఎంతమంది?
16. ఆషేరు గోత్రములో ప్రధానుడు ఎవరు?
17. ఇశ్రాయేలీయులలో పరిశుద్ధ స్థలమును కాపాడ వలసిన బాధ్యత ఎవరిది?
18. ప్రత్యక్షపు గుడారమును మోయుటకు, సేవ చేయుటకు లెక్కింపబడిన వారు ఎంతమంది?
19. సంఖ్యాకాండములో పెద్ద అధ్యాయము ఏది?
20. సంఖ్యాకాండము 6వ అధ్యాయములో పేర్కొనబడిన బలులు ఎన్ని రకములు?
21. అహీరా తండ్రి పేరు ఏమిటి?
22. ఇశ్రాయేలీయులు పని మాని విశ్రమించవలసిన వయస్సు ఎంత?
23. ఇశ్రాయేలీయులు పస్కా పండుగను ఎప్పుడు ఆచరింపవలెను?
24. మనష్షే గోత్రమునకు ప్రధానుడు ఎవరు?
25. మాంసాపేక్షగల జనులు చనిపోయి పాతిపెట్టబడిన ప్రదేశమునకు ఏమని పేరు పెట్టిరి?

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.